# జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక

సంపుటి: 11 సంచిక: 263 గురువారం 03-04-2025 పేజీలు: 08 వెల రూ. 3 www.epaperjournalistdiary.com


## బెంగళూరుకు తొలి ఓటమి

8వికెట్ల తేడాతో ఆర్‌సీబీని చిత్తుచేసిన గుజరాత్ టైటాన్స్



8లో..

# సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లు

# రాజకీయ చదరంగంలో పావులు

యూట్యూబ్ తెరపై యమ యాక్టీవ్‌గా కనబడతారు. మాటల తూటాలు పేలుస్తారు. రాజకీయాలపై అలవోకగా స్పందిస్తారు. వాళ్ల మాటలకు ఓ ఫ్యాన్ బేస్ ఉంటుంది. వాళ్లు చెప్పిందే నిజమనుకుని, దాన్ని పది మందికి చెబుతూ ఉంటారు. ఆ వీడియోలను షేర్ చేస్తుంటారు. ఇక మరో వర్గం ఉంటుంది. వీళ్లది చీర్ లీడర్స్ తరహా. ఐపీఎల్ మ్యాచ్‌లలో మధ్యమధ్యలో కనపడే అందమైన అమ్మాయిల్లా.. పొలిటికల్ పార్టీలకు వత్తాసు పలుకుతూ తెగ మురిసిపోతుంటారు. నేతలపై అభిమానాన్ని ప్రదర్శిస్తూ క్యూట్ క్యూట్ ముచ్చట్లు చెబుతుంటారు. ఆ యూట్యూబ్ జర్నలిస్టులైనా, ఈ ఇన్ స్టా లేడీలైనా అంతా ఆటలో అరటిపండ్లే. ఆ రాజకీయ నాయకుల చదరంగంలో పావులే. ఈ ఇన్‌ఫ్లూయన్సర్లు వాళ్ల డబ్బుల కోసం పని చేస్తారు.వీళ్లను తమ దొడ్లో పశువుల్లా ఆ రాజకీయ నాయకులు సాదుతుంటారు. ఇది ఓ రాజకీయ వికృత క్రీడ. ఓ సిద్ధాంతం, రాద్ధాంతం లేని వ్యవహారం. పైసలు ఖర్చు పెట్టి జనాల అభిప్రాయాలను మార్చాలనుకునే కుట్రరాజకీయం. ఇన్‌ఫ్లూయన్సర్ల మాటలకు, చేతలకు సంబంధం ఉండదు. తమకు నచ్చిన రాజకీయ నాయకుడికి వకల్తా పుచ్చుకోవడమే వీరి పని. ఆ పార్టీకి డ్యామేజ్ కాకుండా రక రకాల విన్యాసాలు చేస్తుండమే వీరి కర్తవ్యం. ఇదంతా ఓ పెయిడ్ బ్యాచ్ వ్యవహారం.

### పొలిటికల్ బఫూన్లుగా యూట్యూబర్లు


### చీర్ లీడర్స్‌గా మారుతున్న ఇన్ స్టా లేడీలు

### సిద్ధాంతాలు లేవు.. రాద్ధాంతాలు అసలే పట్టవు

### సొంత అభిప్రాయాలకు తావు లేదు

- పైసలు తీసుకుంటరు.. నేతలు చెప్పమన్నది చెబుతరు
- విద్వేషపు విషాన్ని చిమ్మడం తప్ప మరేం ఉండదు
- ఇదేనా సామాజిక బాధ్యత అంటే.?
- ఇదేనా దేశం మీద అభిమానం అంటే.?
- పెయిడ్ బ్యాచ్ యూట్యూబర్లు, ఇన్‌ఫ్లూయన్సర్లూ.. రాజకీయాలకు బలవ్వడం తప్ప మరేం ఉండదు!
- జర ఆలోచించి.. ఇకనైనా ఓ మంచి దారిలో వెళ్లండి
- రేపటి తరం కోసం మీ తెలివిని ఉపయోగించండి!



**జర్నలిస్ట్ డైరీ, పొలిటికల్ బ్యూరో (ఏప్రిల్ 02):** రాజకీయం కొత్త పుంతలు తొక్కుతోంది. రేపటి కోసం ఆలోచించే వారు తక్కువ.. తమ స్వార్థం కోసం ఆలోచించే వారు ఎక్కువ. ఓ రాజకీయ సిద్ధాంతం ఉండదు. ఓ అవగాహన ఉండదు. ఉన్నదల్లా డబ్బులు ఇచ్చే పార్టీ పట్ల కృతజ్ఞతా భావమే. యూట్యూబర్లేమో ఇండిపెండెంట్ జర్నలిస్టులుగా తమకు తాము ఎలివేషన్లు ఇచ్చుకుంటూ ఓ తెగ ఫీలయ్ పోతుంటారు. ఇక ఇన్ స్టా లేడీలైతే తమ హావభావాలతో, నటనా పటిమతో సోషల్ యాక్టివిస్టులుగా బిల్డప్ ఇస్తుంటారు. వీళ్లను చూస్తే ''ఎవర్రా మీరంతా'' అన్నట్టుగా ఉంటారు. రాజకీయ నాయకులు ఏది చెబితే అది చెయ్యడం తప్ప మరొకటి రాదు. వాళ్లు నెల నెలా ఇచ్చే డబ్బుల కోసం అర్రులు చాచే బ్యాచ్ ఇది. వీళ్లపై పేటీయం బ్యాచ్ అని కూడా పొలిటికల్ సెటైర్లు వినిపిస్తుంటాయి. ప్రత్యర్థి పార్టీ నాయకుల గురించి

మిగతా 2లో..





# సుప్రీం ధర్మాగ్రహం

### ఫిరాయింపులపై చర్యలకు ఇంకెన్నాళ్లు?

### స్పీకర్ తీరుపై ధర్మాసనం అసహనం

- ఎమ్మెల్యేల ఫిరాయింపులకు యూనివర్సల్ అంటూ సెటైర్లు
- స్పీకర్ విశేష అధికారాలపై వాదనలు వినిపించిన రోహత్గీ
- అయితే తాము చూస్తూ ఉండిపోవాలా అంటూ నిలదీత
- నేటి ఉదయం మరోసారి వాదనలు విననున్న ధర్మాసనం

**జర్నలిస్ట్ డైరీ, న్యూ ఢిల్లీ, (ఏప్రిల్ 02):** తెలంగాణ ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపుల కేసు బుధవారం సుప్రీం కోర్టులో మరోసారి విచారణకు వచ్చింది. ఇదివరకే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, కేటీఆర్, బీజేపీ నేత మహేశ్వర్ రెడ్డి దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టి వారి తరపు లాయర్ల వాదనలు విన్నది. స్పీకర్ తరపున లాయర్ ముకుల్ రోహత్గి వాదనలు వినిపించారు. స్పీకర్ చర్యలు తీసుకోవాలని సైతం ధర్మాసనం ఆదేశించలేదా, ఫిరాయింపుల అంశంపై స్పీకర్ చర్యలు తీసుకోకున్నా తాము చూస్తూ ఉండిపోవాలా అని సుప్రీం ధర్మాసనం

మిగతా 2లో..

# ఇంటికో ఎంట్రప్రెన్యూర్ రావాలి

### సంకల్పాన్ని నిజం చేయండి

- నూతన ఆవిష్కరణలకు ఏపీని వేదిక చేస్తాం
- వచ్చే 5 ఏళ్లలో 20 వేల స్టార్టప్‌ల స్థాపనే లక్ష్యం
- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో భాగస్వాములుకండి
- పారిశ్రామికవేత్తలు, మేధావులకు సీఎం చంద్రబాబు పిలుపు



**జర్నలిస్ట్ డైరీ, అమరావతి(ఏప్రిల్ 02):** రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్'ని తీర్చిదిద్దేందుకు.. 'వన్ ఫ్యామిలీవన్ ఎంట్రప్రెన్యూర్' సంకల్పాన్ని నిజం చేసేందుకు పారిశ్రామికవేత్తలు, కార్పొరేట్ సంస్థలు, ప్రొఫెసర్లు, మేధావులు ముందుకురావాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

మిగతా 2లో..

# బీసీల గళం వినిపించడానికే ధర్నా

### జనగణనతో పాటు కులగణన చేపట్టాలి

### ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి



**జర్నలిస్ట్ డైరీ, న్యూ ఢిల్లీ, (ఏప్రిల్ 02):** బీసీల గొంతుక వినిపించడానికే ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. జనాభా లెక్కలు తేలకుండా రిజర్వేషన్లు ఇవ్వడానికి లేదని కోర్టులు చెప్పాయని, స్థానిక సంస్థలు, చట్ట సభల్లో రిజర్వేషన్లు కావాలంటే జనాభా తేలాలన్నారు. ఢిల్లీలో జంతర్ మంతర్ వేదికగా బీసీ సంఘాలు ధర్నా చేపట్టాయి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ ధర్నాలో పాల్గొన్న రేవంత్ రెడ్డి మీడియాతో ప్రసంగించారు. రిజర్వేషన్ల అంశాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దృష్టికి తీసుకువచ్చామని సీఎం పేర్కొన్నారు. రిజర్వేషన్ల అంశానికి శాశ్వత పరిష్కారం లభించాలని రాహుల్ గాంధీ స్పష్టంగా చెప్పారని, జనగణనతో పాటు కులగణన చేపట్టాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుందని, దామాషా ప్రకారం నిధులు, నియామకాలు చేపట్టాలని కాంగ్రెస్ నిర్ణయం తీసుకుందన్నారు. అధికారంలోకి వస్తే కులగణన చేస్తామని రాహుల్‌గాంధీ చెప్పారని రేవంత్ కొనియాడారు.

# సమగ్ర నివేదిక ఇవ్వండి

### తెలంగాణ ప్రభుత్వానికి కేంద్రం లేఖ

### కంచ గచ్చిబౌలి భూ వివాదంపై స్పందన




**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్ (ఏప్రిల్ 02):** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రాంతంలోని భూముల వేలం తెలంగాణలో హాట్‌టాపిక్‌గా మారింది. అధికార కాంగ్రెస్ పార్టీ టార్గెట్‌గా ప్రతిపక్ష పార్టీలు బీజేపీ, బీఆర్‌ఎస్ విమర్శలు గుప్పిస్తున్నాయి. భూములు అమ్మితేగాని ప్రభుత్వం నడవదా అంటూ బీజేపీ ప్రశ్నిస్తోంది. కంచ గచ్చిబౌలి 400 ఎకరాల భూమి విషయంలో చర్యలు తీసుకోవాలంటూ బీజేపీ నేతలు.. ఇప్పటికే.. కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు.ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని కోరారు. దీనిపై పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ స్పందించింది.. దీనిపై సమగ్ర నివేదికను కోరుతూ తెలంగాణ ప్రభుత్వానికి లేఖ రాసింది..

మిగతా 2లో..




భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)

కేంద్ర కమిటీ

# శాంతి చర్చలకు సిద్ధం

### కేంద్రానికి మావోయిస్టుల లేఖ

### వరుస ఎదురుదెబ్బలతో ప్రతిపాదన

**జర్నలిస్ట్ డైరీ, న్యూఢిల్లీ(ఏప్రిల్ 02):** మావోయిస్టులు పిట్టల్లా రాలిపోతున్నారు. దండకారణ్యంలో వరుస ఎన్‌కౌంటర్లు జరుగుతున్నాయి. కనిపిస్తే కాల్చేసుడే. 2026 మార్చి కల్లా దేశంలో మావోయిస్టులే లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా శపథం చేశారు. అన్నట్టుగానే.. వారానికో ఎన్‌కౌంటర్. పదుల సంఖ్యలో అన్నలు హతమవుతున్నారు. గడిచిన 3 నెలల కాలంలో 130 మంది మావోలను లేపేశాయి ఆర్మ్‌డ్ ఫోర్సెస్. తుపాకుల గర్జనతో అడవుల్లో మరణమృదంగం మోగుతోంది. జవాన్ల టార్గెట్‌గా ల్యాండ్‌మైన్లు పెడుతున్నా.. బలగాలు ముందే పసిగడుతున్నాయి. అంత పక్కాగా సాగుతోంది కూంబింగ్ ఆపరేషన్. వరుస మరణాలు, ఎదురుదెబ్బలతో మావోయిజం అల్లకల్లోలం అవుతోంది. లేటెస్ట్‌గా శాంతి చర్చలకు సిద్ధమని మావోయిస్టులు ప్రకటన విడుదల చేశారు. మావోయిస్ట్ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో లేఖ విడుదలైంది. శాంతి చర్చల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సానుకూలంగా స్పందించాలని లేఖలో కోరారు. సానుకూలంగా స్పందిస్తే కాల్పులను విరమిస్తామని.. శాంతి చర్చలకు సానుకూల వాతావరణం సృష్టించాలని లేఖలో కోరారు అభయ్.ఆపరేషన్ కగార్ పేరుతో సీఆర్పీఎఫ్, కోబ్రా, ప్రత్యేక బలగాలు కలిసికట్టుగా

మిగతా 2లో..



## మీకు పవర్ ఉంది!

2లో..



2లో..

## వక్ఫ్ చట్టానికి సవరణలు అవసరం




## సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయన్సర్లు రాజకీయ చదరంగంలో పావులు

(మొదటి పేజీ తరువాయి)

వ్యంగ్యంగా మాట్లాడటం, అవహేళన చేయడం, రాజకీయ విద్వేషాన్ని పెంచడం తప్ప ఇంకొకటి చేతగాదు. అదో తుత్తి అన్నట్టుగా వ్యవహరిస్తుంటారు.

రాజకీయ పార్టీలకు చెంచాగిరి చేయడం అలవాటుగా మారిపోయిన ఈ ఇన్‌ఫ్లూయన్సర్లు.. ప్రత్యర్థి పార్టీలపై విషం చిమ్ముతుంటారు. వాళ్ల మాటలకు అట్రాక్ట్ అయిన జనం అవే నిజమని నమ్ముతూ తమ తమ వాట్సాప్ గ్రూపులలో షేర్ చేస్తుంటారు. వాట్సాప్ యూనివర్సిటీలను ఢీకొట్టేలా ఇన్ ఫ్లూయన్సర్లు తమ నాటకాలను తెగ రక్తికట్టిస్తుంటారు. ఈ గుంపులో గోవిందాల వల్ల అసలైన జర్నలిస్టులు, మేధావులు కూడా మాట పడాల్సి వస్తోంది. అందరూ అదే కోవకు చెందినవారన్న భ్రమలకు లోనుకావలసి వస్తోంది. జనాలను మభ్యపెట్టి, మాయాజాలం సృష్టించే వారే ఎక్కువగా ఉండటంతో నిజాయితీపరులైన, స్వతంత్ర జర్నలిస్టులకు విలువ లేకుండా పోతోంది. రేపటి తరం కోసం ఆలోచనే అన్నది లేని స్వార్థ రాజకీయ పరాన్నజీవుల వల్ల ఎంతో మంది నికార్సైన జర్నలిస్టులు తెరమరుగవుతున్నారు. కుహనా మేధావులు పుట్టుకొస్తున్నారు. ప్రపంచ మేధావులుగా చలామణి అవుతున్నారు.

ఇప్పటికైనా జనం మేలుకోవాలి. ఇన్ ఫ్లూయన్స్ చేస్తున్న వారి పట్ల అప్రమత్తంగా ఉండాలి. ప్రాంతం, కులం, దేవుడు, ధర్మం పేరుతో మేధావుల్లా, అతితెలివి చూపించే వారితో తస్మాత్ జాగ్రత్త. జనం బాగు కోసం, జనం కోణంలో మాత్రమే ఆలోచించే జర్నలిజానికి జై కొట్టండి. ఆ జర్నలిస్టులను బతికించండి. జర్నలిజం పేరుతో శవాలపై పేలాలు ఏరుకునే ఇన్ ఫ్లూయన్సర్లను తరిమికొట్టండి.

## సమగ్ర నివేదిక ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో అటవీ భూమిని స్వాధీనం చేసుకునే విషయానికి సంబంధించి పూర్తి వివరాలతో రిపోర్ట్ ఇవ్వాలని కోరింది.పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా, కంచ గచ్చిబౌలి గ్రామంలో అక్రమంగా చెట్ల నరికివేత, వృక్షసంపద తొలగింపు గురించి మంత్రిత్వ శాఖకు ఫిర్యాదు అందింది.. ఈ భూమిలో కనిపించే వన్యప్రాణులు, సరస్సులకు.. ఈ ప్రాంతంలో కనిపించే ప్రత్యేకమైన రాతి నిర్మాణాలకు నష్టం వాటిల్లిందని ఆరోపిస్తూ ప్రింట్, సోషల్ మీడియాలో వివిధ వార్తా కథనాలు వచ్చాయి. దీనిపై పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖకు.. పార్లమెంటు సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధుల నుండి వ్యక్తిగతంగా వివిధ ఫిర్యాదులను అందుకుంది. ఈ విషయంపై వెంటనే వాస్తవ నివేదికను అందించండి.. భారత అటవీ చట్టం, వన్యప్రాణుల రక్షణ చట్టం, వాన్ (సంరక్షణ ఏవం సంవర్ధన్) అధినియం నిబంధనల ప్రకారం చట్టపరమైన చర్య తీసుకోండి.. గౌరవనీయులైన కోర్టులు, ట్రిబ్యునళ్ల ఇతర చట్టాలు లేదా ఆదేశాలను ఉల్లంఘించలేదని నిర్ధారించుకోండి. పైన కోరిన విధంగా ఈ విషయంలో వాస్తవ నివేదిక.. చర్య తీసుకున్న నివేదికను మంత్రిత్వ శాఖకు సమర్పించాలి.. అంటూ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ ఫారెస్ట్ ఎస్. సుందర్ తెలంగాణ ప్రభుత్వానికి రాసిన లేఖలో పేర్కొన్నారు. కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమి విషయంలో చొరవ తీసుకోవాలని తెలంగాణకు సంబంధించిన బీజేపీ ఎంపీలు సమర్పించిన ఫిర్యాదుపై పర్యావరణ మంత్రిత్వ శాఖ స్పందించడం.. వాస్తవ నివేదిక కోరుతూ తెలంగాణ ప్రభుత్వానికి లేఖ రాయడంపై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పందించారు. తాను, తెలంగాణ బీజేపీ ఎంపీలు సమర్పించిన ఫిర్యాదుకు ప్రతిస్పందనగా త్వరిత, నిర్ణయాత్మక చర్య తీసుకున్నందుకు గౌరవనీయ కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల మంత్రి భూపేంద్ర యాదవ్ కు కృతజ్ఞతలు తెలిపారు. అటవీ చట్టం, కోర్టు ఆదేశాలను ఉల్లంఘించినందుకు TGIICపై నిజ నిర్ధారణ నివేదికను సమర్పించి అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి గౌరవనీయ మంత్రి ఆదేశం, జవాబుదారీతనం నిర్ధారించడం, మరింత పర్యావరణ ప్రమాదాలను నివారించడం, పచ్చదనాన్ని రక్షించడంలో ఒక ముఖ్యమైన అడుగు అంటూ కిషన్ రెడ్డి పేర్కొన్నారు. ఇది అన్ని చర్యలు చట్టపరమైన పరిధిలో ఉండేలా చేస్తుందని తెలిపారు.ఇదిలాఉంటే.. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఉద్రిక్త పరిస్థితులకు ఏమాత్రం బ్రేక్ పడడంలేదు. ఒకవైపు విద్యార్థుల ఆందోళన.. మరోవైపు పోలీసుల మోహరింపుతో HCU రణరంగాన్ని తలపిస్తోంది.

# శాంతి చర్చలకు సిద్ధం

(మొదటి పేజీ తరువాయి)

స్పెషల్ కూంబింగ్ చేస్తున్నాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఈ ఆపరేషన్‌ను డైరెక్ట్‌గా డీల్ చేస్తున్నారు. అబూజ్‌మడ్‌లో మావోయిస్టులను ఏరిపారేస్తున్నారు. గత నెలలో ఒకే ఎన్‌కౌంటర్లో 30 మందికి పైగా మావోలు మరణించారు. ఆ తర్వాత మరో 10 మంది హతమయ్యారు. ఇలా ఫిబ్రవరిలో 40 మంది.. జనవరిలో 48 మంది మావోయిస్టులను భద్రతా బలగాలు చంపేశాయి.

గతేడాది ఛత్తీస్‌గడ్, దండకారణ్యంలో జరిగిన ఎన్‌కౌంటర్స్‌లో ఏకంగా 235 మంది మావోయిస్టులు హతమయ్యారు. ఎప్పటికప్పుడు ఈ నెంబర్ పెరుగుతూనే పోతోంది. ఒకప్పుడు 14 రాష్ట్రాలలో ఉన్న మావో ఉద్యమం.. ప్రస్తుతం ఛత్తీస్‌గడ్‌కు మాత్రమే పరిమితమైంది.కేంద్ర కమిటీ, పొలిట్‌బ్యూరో టార్గెట్‌గా పోలీస్ బలగాలు అడవుల్ని జల్లెడ పడుతున్నాయి. అయితే, ఎంత గాలిస్తున్నా.. మోస్ట్ వాంటెడ్ మావోయిస్ట్ హిడ్మా మాత్రం చిక్కడు దొరకడు టైప్‌లో తప్పించుకుంటూనే ఉన్నాడు. కేంద్ర బలగాలకు చుక్కలు చూపిస్తున్నాడు. అబూజ్‌మడ్‌లో ప్రస్తుతానికి ఫుల్ యాక్టివ్‌గా ఉన్నది హిడ్మా ఒక్కడే. అతని కోసమే పోలీస్ వేట. ఎంతగా వెంటాడినా.. కుక్కలు, డ్రోన్లు, హెలికాప్టర్లతో గాలించినా.. హిడ్మా మాత్రం దొరకట్లే. అతని కోసం ఏకంగా 125 గ్రామాల్లో జల్లెడ పడుతున్నారు. హిడ్మా హతమైతే.. ఇక దండకారణ్యంలో మావోయిజం అంతమైనట్టే. బహుషా అందుకే కాబోలు.. సడెన్‌గా మావోయిస్టులు శాంతి ప్రతిపాదనలో ముందుకొచ్చారు. కాల్పులు ఆపేస్తే.. తాము చర్చలకు వస్తామంటూ డీల్ తీసుకొచ్చారు. ఈ ఎత్తుగడ హిడ్మాను కాపాడుకోవడానికేనా? భద్రతా బలగాలది అప్పర్ హ్యాండ్‌గా ఉన్న ప్రస్తుత




తరుణంలో కాల్పుల విరమణకు కేంద్రం ఒప్పుకుంటుందా? అమిత్ షా ఏమంటారన్నది చర్చనీయాంశంగా మారింది.




# సుప్రీం ధర్మాగ్రహం

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించింది. అసెంబ్లీ కార్యదర్శి తరపున సీనియర్ లాయర్ అభిషేక్ మను సింఘ్వీ వాదనలు వినిపించనున్నారు. నేడు ఉదయం 10 గంటలకు ధర్మాసనం సమయం కేటాయించింది. విచారణలో ప్రతివాదులుగా ఉన్న తెలంగాణ అసెంబ్లీ స్పీకర్, ఫిరాయింపు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేల తరఫు వాదనలు సుప్రీంకోర్టు ధర్మాసనం విన్నది. 'ఒక రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పులపై మరో రాజ్యాంగ ధర్మాసనం తీర్పులు ఎలా ఇస్తుంది? స్పీకర్ కు రాజ్యాంగం విశేష అవకాశాలు కల్పించింది. వాటిని కోర్టులు హరించకూడదు. స్పీకర్ నిర్ణయం తీసుకున్నాక కోర్టులు దానిపై న్యాయసమీక్ష చేపట్టే అవకాశం ఉంటుంది. కానీ ఫలానా సమయానికి నిర్ణయం తీసుకోవాలని స్పీకర్ కు కోర్టులు చెప్పడం భావ్యం కాదు. కోర్టులు, ధర్మాసనాలు ఇచ్చే సూచనలు పాటించాలా.. లేదా అనేది విశేష అధికారం స్పీకర్లకు ఉంటుంది' అని ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. సకాలంలో ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌కు సూచించలేమా అని జస్టిస్ బీఆర్ గవాయ్ ప్రశ్నించారు.

ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు బీఆర్ఎస్ నేతలు ఫిర్యాదు చేసిన వారం రోజుల్లోనే కోర్టులో పిటిషన్ వేశారని ముకుల్ రోహత్గీ తెలిపారు. స్పీకర్ కు దీనిపై ఆలోచించుకునే సమయం కూడా ఇవ్వకుండా, ఒక పిటిషన్ తరువాత మరో పిటిషన్ వేస్తూ పోయారని సుప్రీంకోర్టు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. కోర్టులు రాజ్యాంగ పరిరక్షకులుగా ఉంటాయని జస్టియ్ బీఆర్ గవాయ్ అన్నారు. ఇప్పటికే ఏడాది ముగిసింది, మరో నాలుగేళ్లు స్పీకర్ చర్యలు తీసుకోకపోయినా కోర్టులు ఎలాంటి ఆదేశాలు జారీ చేయకూడదా.. ఇలాగే చూస్తూ



ఉండిపోవాలా అని ముకుల్ రోహత్గీని ప్రశ్నించారు. పిటిషనర్ల ఇష్టానుసారం అసెంబ్లీ స్పీకర్ నిర్ణయాలు తీసుకోరని, గత ఏడాది మార్చి 18న పిటిషనర్లు స్పీకర్ కు ఫిర్యాదు చేయగా.. ఈ జనవరి 16న ఫిరాయింపు ఎమ్మెల్యేలకు స్పీకర్ నోటీసులు జారీ చేశారని ముకుల్ రోహత్గీ అన్నారు .ఈ పిటిషన్లపై ఫిర్యాదులు ఇచ్చినా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎందుకు చర్యలు తీసుకోలేదని కోర్టు పలుమార్లు అసహనం వ్యక్తం చేసింది. కోర్టు ఫిరాయింపులకు యానివర్సరీ అయ్యిందా అంటూ ధర్మాసనం సెటైర్లు వేసింది. ఎమ్మెల్యేల ఫిరాయింపులపై ఫిర్యాదులు వచ్చినా చర్యలు తీసుకోకుండా, ఎందుకు జాప్యం జరిగిందని స్పీకర్ కు, తెలంగాణ ప్రభుత్వానికి కౌంటర్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు గతంలోనే నోటీసులు ఇచ్చిన విషయం తెలిసిందే.



### వక్ఫ్ చట్టానికి
## సవరణలు అవసరం

**ప్రభుత్వం ఏ మత సంస్థలోనూ జోక్యం చేసుకోబోదు**

**బిల్లులో భాగం కానీ అంశాలపై ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు**

**ఈ బిల్లుకు మతంతో సంబంధం లేదు**

**ఆస్తులతో మాత్రమే వ్యవహరిస్తుంది**

**లోక్‌సభలో సవరణ బిల్లు ప్రవేశపెట్టిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు**

**జర్నలిస్ట్ డైరీ, న్యూ ఢిల్లీ (ఏప్రిల్ 02):** లోక్‌సభలో ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ ప్రతిపాదించిన వక్ఫ్ (సవరణ) బిల్లు 2025ను బుధవారం కేంద్ర మైనారిటీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రవేశపెట్టారు. ఈ బిల్లు వక్ఫ్ ఆస్తుల పరిపాలనను మెరుగుపరచడం, సాంకేతికత ఆధారిత నిర్వహణను ప్రవేశపెట్టడం, సంక్లిష్టతలను పరిష్కరించడం, పారదర్శకతను నిర్ధారించడం లక్ష్యంగా కలిగి ఉన్నదని మంత్రి చెప్పారు. బిల్లును ప్రవేశపెడుతూ, ఉమ్మడి పార్లమెంటరీ కమిటీ (జెపిసి) సంప్రదింపుల ప్రక్రియ భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో పార్లమెంటరీ ప్యానెల్ నిర్వహించిన అతిపెద్ద కసరత్తు అని రిజిజు అన్నారు."ప్రభుత్వం ఏ మత సంస్థలోనూ జోక్యం చేసుకోబోదు. యూపీఏ ప్రభుత్వం వక్ఫ్ చట్టంలో చేసిన మార్పులు ఇతర చట్టాల కంటే అధిక ప్రభావాన్ని చూపాయి, అందువల్ల కొత్త సవరణలు అవసరమయ్యాయి" అని మంత్రి రిజిజు అన్నారు. "వక్ఫ్ బిల్లులో భాగం కాని అంశాలపై మీరు ప్రజలను తప్పుదారి పట్టించడానికి ప్రయత్నించారు" అని రిజిజు ప్రతిపక్షాలకు అన్నారు. ఈ బిల్లుకు మతంతో సంబంధం లేదు, కానీ ఆస్తులతో మాత్రమే వ్యవహరిస్తుందని ఆయన అన్నారు.బిల్లు ప్రకారం, ముస్లింలు (కనీసం ఐదు సంవత్సరాలు) మాత్రమే తమ ఆస్తిని వక్ఫ్‌కు అంకితం చేయగలరు. ఈ బిల్లు ద్వారా 2013 కి ముందు నియమాలను పునరుద్ధరిస్తారు. అలాగే, వితంతువులు, విడాకులు తీసుకున్న మహిళలు మరియు అనాథలకు ప్రత్యేక నిబంధనలతో వక్ఫ్ ప్రకటనకు ముందు మహిళలు తమ వారసత్వాన్ని పొందాలి. జెపిసి నిర్వహించిన సుదీర్ఘ సంప్రదింపుల ప్రక్రియ తర్వాత బిల్లును ప్రవేశపెట్టినట్లు కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. బిల్లును మొదట ఆగస్టు 2024లో ప్రవేశపెట్టారని, ఆ తర్వాత సభ కోరినట్లుగా, దానిని జెపిసికి పంపారని, దానిపై సుదీర్ఘ సంప్రదింపులు జరిపామని అమిత్ షా చెప్పారు.

## ఇంటికో ఎంట్రప్రెన్యూర్ రావాలి

(మొదటి పేజీ తరువాయి)



పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ నుంచి కొత్తగా పారిశ్రామిక వేత్తలు రావాలని, నూతన ఆవిష్కరణలకు ఏపీ హబ్ కావాలని, అదే స్థాయిలో పెట్టుబడులు కూడా ఆశిస్తున్నామని అన్నారు. అందిరిలో స్ఫూర్తి నింపేందుకే ఇన్నోవేషన్‌కు హబ్‌కు రతన్ టాటా వంటి గొప్ప వ్యక్తి పేరు పెట్టామని చెప్పారు. బుధవారం సచివాలయంలో పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు, విద్యావంతులతో 'రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్' గురించి ముఖ్యమంత్రి సమావేశం అయ్యారు. ఆర్టీఐహెచ్ వైస్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న టాటా గ్రూపు, టాటా సన్స్ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ సహా మరి కొందరు ప్రముఖులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశంలో పాల్గొన్నారు.

**నాటి సంస్కరణలతో సత్ఫలితాలు:**

భారతీయులు దేశవిదేశాల్లో ఎంట్రప్రెన్యూర్లుగా ఎదిగారని, అలాగే తలసరి ఆదాయంలోనూ విదేశీయులు కన్నా ఎక్కువ ఆర్జిస్తున్నారని, వారిలో 30 శాతం తెలుగు ప్రజలు ఉన్నందుకు తనకు గర్వంగా ఉందని ముఖ్యమంత్రి అన్నారు. నిజానికి ఇప్పుడు తెలుగు ప్రజలు ఈ స్థాయికి చేరుకోవడానికి తాను మొదటిసారి ముఖ్యమంత్రి అయినప్పుడు తీసుకువచ్చిన సంస్కరణల ఫలితమని చెప్పారు. సీఐఐ సమావేశాలు నిర్వహించడం, ఇంజినీరింగ్ కాలేజీలు నెలకొల్పడం, మైక్రోసాఫ్ట్ సహా ప్రముఖ కంపెనీలు ఏర్పాటయ్యేలా చూడటంతో హైదరాబాద్ దశదిశ మారిపోయిందన్నారు. నాడు హైదరాబాద్‌ను ఐటీ హబ్ చేసినట్టుగానే, ఇప్పుడు అమరావతిని క్వాంటమ్ వ్యాలీ చేయాలనేది తన సంకల్పంగా చెప్పారు. అలాగే 'వన్ ఫ్యామిలీ వన్ ఐటీ ప్రొఫెషనల్' అని గతంలో తాను చేసిన ప్రయత్నాలు మంచి ఫలితాలు ఇచ్చాయని గుర్తు చేశారు. భారతీయులు ఎక్కడ ఉన్నా ఆయా ప్రాంతాలను, అక్కడ పరిస్థితులను ఆకళింపు చేసుకుని ప్రతిభతో రాణిస్తున్నారని అన్నారు. దూరం అనేది ప్రపంచంలో ఒక సమస్య కాదన్నారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు అడుగులు వేశామన్నారు.

# మీకు పవర్ ఉంది!


**దయచేసి ఆ జంతువుల గురించి ఆలోచించండి**

**యాంకర్ రష్మి స్పందన**

**కంచ గచ్చిబౌలి భూవివాదంలో..**

**విద్యార్థులకు మద్దతుగా సెలబ్రెటీలు!**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్(ఏప్రిల్ 02):** కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాల పచ్చని భూమిని కాపాడాలంటూ కొన్ని రోజులుగా ఆందోళన జరుగుతోంది. పచ్చదనం, వన్యప్రాణులు ఉన్న ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పేరిట నాశనం చేయొద్దంటూ విద్యార్థులు, వివిధ సంఘాలు ఆందోళన చేస్తున్నాయి. ఈ ఆదివారం రాత్రి క్యాంపస్‌లో భూమిని చదును చేయడానికి ప్రయత్నం చేసినప్పుడు పెద్ద గొడవే జరిగింది. ఆందోళన చేసిన విద్యార్థులను అరెస్ట్ చేశారు. ప్రభుత్వం ప్రొక్లెయిన్లతో చెట్లను తొలగిస్తున్నప్పుడు.. కొన్ని పక్షులు అరుస్తున్నట్లుగా ఉన్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. వాటిని షేర్ చేస్తూ ఈ భూమిని పరిరక్షించాలని కొంతమంది సెలబ్రిటీలు కూడా కోరుతున్నారు. ఇప్పుడు యాంకర్ రష్మీ కూడా అదే డిమాండ్ చేసింది. యాంకర్, నటి రష్మి గౌతమ్ తన ఇన్ స్టాలో ఓ వీడియోను విడుదల చేసింది, అందులో ఆమె ప్రభుత్వాన్ని హెచ్‌సీయూ విషయంలో నిర్ణయాలు తీసుకునేటప్పుడు పక్షులు , జంతువులను గుర్తుంచుకోవాలని కోరింది. సోషల్ మీడియాలో వైరల్ అయిన ఒక క్లిప్‌ను యాడ్ చేసి రష్మి గౌతమ్ ఈ వీడియోను పోస్ట్ చేసింది, అందులో హెచ్‌సీయూ దగ్గర ఉన్న భూమిపై చెట్లు నరికివేస్తుండగా.. అక్కడ ఉన్న



నెమళ్లు దారుణంగా ఏడుస్తున్నట్లు చూపించారు. "నేను ఈ వీడియోను పోస్ట్ చేసిన తర్వాత నాపై చాలా వ్యతిరేకత వస్తుంది. అయితే, ఈ వీడియో ఏ రాజకీయ ఆలోచనా విధానానికి వ్యతిరేకం కాదు. ఆంధ్రప్రదేశ్ , తెలంగాణ లేదా మన దేశంలోని ఏ అభివృద్ధి పనులకు వ్యతిరేకంగా కూడా నేను ఈ వీడియోను పోస్ట్ చేయడం లేదు" అన్నారు. ఆ తర్వాత ఆమె "హెచ్‌సీయూలో జరుగుతున్న పోరాటం అందరికీ తెలుసు. అందరూ సోషల్ మీడియాలో ఆల్ ఐస్ ఆన్ హెచ్‌సీయూ అని పోస్ట్ చేస్తున్నారు. నేను చాలా కంఫర్టబుల్‌గా నా అపార్ట్‌మెంట్ నుంచి ఈ వీడియోను పోస్ట్ చేస్తున్నాను. ఈ అపార్ట్‌మెంట్ నిర్మించినప్పుడు, చాలా చెట్లు మరియు జంతువులు చనిపోయి ఉంటాయని నాకు కూడా తెలుసు. ఇప్పుడు నేను ఇక్కడ కూర్చుని.. ఈ వీడియోను చేసేసి... ఏది సరైనది, ఏది తప్పు అని మాట్లాడటం చాలా సులభం" అని కామెంట్ చేసింది. కానీ ఒక సామాన్యురాలిగా, ఈ సమస్య ఎందుకు వచ్చిందనే దాని గురించి అంత డీటైయిల్డ్‌గా తెలీదు అని పేర్కొంటూ, "దాని చట్టపరమైన అంశాలు ఏమిటి అన్న దానిపై నాకు అంతగా అవగాహన లేదు" అన్నారు.

**మనం మారడానికి ఇది అవకాశం**

కంచ గచ్చిబౌలి భూ వివాదంపై చాలా మంది సెలబ్రిటీలు మాట్లాడారు. కల్కి డైరక్టర్ నాగ అశ్విన్, బహూభాషా నటుడు ప్రకాశ్‌రాజ్, నటి రేణూ దేశాయ్ వంటి వారు ఇది సరైంది కాదన్నారు. తెలుగులో సెలబ్రిటీ యాంకర్‌గా ఉన్న రష్మి కూడా ఇప్పుడు ఆ జాబితాలో చేరింది. తనకు రాజకీయాలతో సంబంధం లేదని.. కేవలం మూగ జీవాల ఆవేదన చూడలేకనే ఇలా మాట్లాడుతున్నా అని ఆమె చెప్పుకొచ్చింది. ముందు ఎలాంటి నిర్ణయం తీసుకున్నా.. కనీసం పక్షులు, జంతువులు అరుస్తున్న వీడియో చూశాక అయినా మారాలని కోరింది. "సాధారణ వ్యక్తిగా, నిన్న రాత్రి విడుదలైన ఆ వీడియోలో ఆ పక్షులన్నీ ఏడుస్తున్న శబ్దం విన్న తర్వాత ఆ పక్షులు, నెమళ్లు మాత్రమే కాదు, అక్కడ నివసిస్తున్న మరెన్నో జాతుల జింకలు జంతువులు ఉన్నాయి. ఇది మనల్ని మనం తిరిగి సరిచేసుకునే అవకాశం కావచ్చు" అన్నారు. వేసవి లో ఎండలు పెరుగుతున్న ఈ టైమ్‌లో "ఆ జంతువులను, పక్షులను వాటి నివాసాల నుండి వెళ్లగొట్టడం ఎంతవరకు సరైనదో నాకు తెలియదు" ఇప్పటికైనా ఈ విషయాన్ని మరోసారి ఆలోచించాలని రష్మీ కోరింది. "మీకు పవర్ ఉంది. ఆ జంతువులకు పునరావాసం కల్పించడానికి అవకాశం ఉన్న ఏకైక ఆప్షన్ కూడా మీరే కాబట్టి, నేను మనస్ఫూర్తిగా మిమ్మల్ని అభ్యర్థిస్తున్నాను, దయచేసి ఆ జంతువులు, పక్షులను కూడా గుర్తుంచుకోండి. మీరు తదుపరి నిర్ణయాలు తీసుకునేటప్పుడు వాటిపట్ల పాజిటివ్‌గా ఉండండి, ఈ విషయం మన ప్రభుత్వానికి చేరుకుని వారు ఈ జంతువులను పునరావాసం చేసి తర్వాత వారి తదుపరి చర్య తీసుకుంటారని నేను ఆశిస్తున్నాను. మంచి కోసం ఆశిద్దాం." వీడియోను ముగించారు.



## ఏటీఎం కార్డుల తరహాలో
# రేషన్ కార్డులు

**సన్నాహాలు సిద్ధం చేస్తున్న కూటమి సర్కార్**
**మే నెల నుంచి కొత్త రేషన్ కార్డులు..**

**జర్నలిస్ట్ డైరీ, విజయవాడ, (ఏప్రిల్ 2):** ఆంధ్రప్రదేశ్‌లో కొత్త రేషన్ కార్డులు జారీ చేసేందుకు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. మే నెల నుంచి కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ఏపీ పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఏటీఎం కార్డు సైజులో ఉండే కొత్త స్మార్ట్ రేషన్ కార్డులను మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈ కొత్త స్మార్ట్ రేషన్‌కార్డులో క్యూఆర్ కోడ్, ఇతర సెక్యూరిటీ ఫీచర్లు ఉంటాయని నాదెండ్ల మనోహర్ తేల్చి చెప్పారు. కొత్త రేషన్ కార్డుల జారీ సహా వివిధ అంశాలపై ఏపీ సచివాలయంలో మంత్రి నాదెండ్ల మనోహర్ మీడియాకు వివరించారు. ఈ స్మార్ట్ కార్డులో కుటుంబ సభ్యులకు సంబంధించిన అన్ని వివరాలు ఉంటాయని.. అది రేషన్ కార్డుగా కాకుండా ఫ్యామిలీ కార్డుగా ఉంటుందని తెలిపారు.ఇక రేషన్ కార్డుల్లో మార్పులు చేర్పులకు సంబంధించి కూడా మంత్రి నాదెండ్ల వివరించారు. రేషన్ కార్డుల్లో కుటుంబ సభ్యులను జోడించడం.. ఉన్నవారి పేర్లను తొలగించడం.. స్ప్లిట్ కార్డులు అప్లై చేసుకునేందుకు ఆప్షన్లు ఇస్తామని మంత్రి తెలిపారు. ఈకేవైసీ పూర్తైతే ఎంతమందికి రేషన్ కార్డులు జారీ చేయాలో స్పష్టత వస్తుందని మనోహర్ చెప్పారు. ఈ నెలాఖరులోగా ఈకేవైసీ పూర్తి చేస్తామని.. ఆ తర్వాత కొత్త రేషన్ కార్డులపై దృష్టి సారిస్తామని వెల్లడించారు. మరోవైపు.. మంగళవారం నుంచే దీపం2 రెండో విడత గ్యాస్ సిలిండర్ బుకింగ్ ప్రారంభమైనట్లు మంత్రి వివరించారు. రాష్ట్రంలో రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు చేసే ప్రక్రియ కొనసాగుతోందని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. రైతులు తమకు నచ్చిన మిల్లుకు తీసుకెళ్ళారు.





# యోగి వర్సెస్ స్టాలిన్

**త్రిభాషా విధానంపై హాట్‌గా నడుస్తున్న చర్చ**
**యూపీ సీఎం యోగి కీలక వ్యాఖ్యలు**

**జర్నలిస్ట్ డైరీ, లక్నో, (ఏప్రిల్ 2):** జాతీయ విద్యా విధానంలోని త్రిభాషా సూత్రం అమలుపై తమిళనాడు, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మధ్య వివాదం తీవ్రరూపం దాల్చింది. ఈ నేపథ్యంలో ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కీలక వ్యాఖ్యలు చేశారు. యూపీలోని కొన్ని పాఠశాలల్లో తమిళం, తెలుగు, కన్నడ, మలయాళం, బెంగాలీ, మరాఠీ వంటి భాషలను బోధిస్తున్నామని, దీనివల్ల ఉపాధి అవకాశాలు, ఉద్యోగాలు సృష్టిస్తున్నామని ఒక ఇంటర్వ్యూలో తెలిపారు. 'ఇలా చేయడం వల్ల రాష్ట్రం చిన్నదైపోతుందా?' అని ప్రశ్నిస్తూ, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌పై విమర్శలు గుప్పించారు. స్వార్థపూరిత రాజకీయ ప్రయోజనాల కోసం స్టాలిన్ త్రిభాషా విధానాన్ని వ్యతిరేకిస్తున్నారని, ఇది యువత ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తుందని ఆరోపించారు. యోగి వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత కార్తీ చిదంబరం స్పందించారు. 'యూపీలో తమిళం బోధించే ఉపాధ్యాయులు ఎంత మంది ఉన్నారు? తమిళం నేర్చుకునేందుకు ఎంత మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు?' అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. తమిళనాడు విద్యార్థులు హిందీని తప్పనిసరిగా నేర్చుకోవాల్సిన అవసరం లేదని, రాష్ట్రానికి వచ్చే కార్మికులు తమిళం నేర్చుకోవాలని, హిందీని బలవంతంగా రుద్దే ఆలోచనను విరమించాలని ఆయన డిమాండ్ చేశారు.త్రిభాషా విధానంపై యోగి, స్టాలిన్ మధ్య ఇటీవల మాటల యుద్ధం తీవ్రమైంది. స్టాలిన్ ఓటు బ్యాంకు భయంతోనే ఈ విధానాన్ని వ్యతిరేకిస్తున్నారని యోగి విమర్శించగా, స్టాలిన్ దీనిని 'పొలిటికల్ డార్క్ కామెడీ'గా అభివర్ణించి ఎద్దేవా చేశారు. NEP-2020లోని త్రిభాషా సూత్రం ప్రకారం, విద్యార్థులు మూడు భాషలు నేర్చుకోవాలి, అందులో రెండు జాతీయ భాషలు ఉండాలని కేంద్రం చెబుతోంది. అయితే, హిందీని బలవంతంగా రుద్దడానికే ఈ విధానం తెచ్చారని తమిళనాడు వంటి రాష్ట్రాలు ఆరోపిస్తున్నాయి.వివాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. భాషా విధానం రాజకీయ, సాంస్కృతిక సున్నితత్వాలను తాకుతుండటంతో, ఈ అంశంపై రాష్ట్రాలు, కేంద్రం మధ్య సమన్వయం కీలకంగా మారింది. త్రిభాషా విధానం విద్య, ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుందా లేక భాషా వివాదాలను మరింత రెచ్చగొడుతుందా అనేది చూడాల్సి ఉంది.



## ఉమ్మడి జిల్లాల నేతలతో కేసీఆర్ భేటీ

**సిల్వర్ జూబ్లీ వేడుకలపై చర్చలు**

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్ (ఏప్రిల్ 02):** బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభ నిర్వహణ నేపథ్యంలో ఉమ్మడి మెదక్,నిజామాబాద్ జిల్లాల ముఖ్యనేతలతో, అధినేత కేసీఆర్ బుధవారం ఎర్రవెల్లి నివాసంలో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె టి రామారావు,మెదక్ జిల్లా మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్,ఎమ్మెల్యేలు సిద్దిపేట జిల్లా పార్టీ అధ్యక్షుడు కె. ప్రభాకర్ రెడ్డి, సంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు చింత ప్రభాకర్, మాణిక్ రావు, మెదక్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు పద్మ దేవేందర్ రెడ్డి, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవ్ రెడ్డి,సునీత లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరీ సుభాష్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు క్రాంతి కిరణ్, ,భూపాల్ రెడ్డి, పార్టీ నేతలు జైపాల్ రెడ్డి, ఆదర్శ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి మాజీ మంత్రి,ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాజిరెడ్డి గోవర్ధన్,గణేష్ బిగాల గుప్త, గంప గోవర్ధన్, జాజుల సురేందర్, హనుమంత్ షిండే, నిజామాబాద్ జిల్లా పార్టీ అధ్యక్షుడు అశన్న గారిజీవన్ రెడ్డి, కామారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షులు ముజీబుద్దీన్, ఆయేషా షకీల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



## నిత్యానంద బతికే ఉన్నారు

**'కైలాస' దేశం ప్రకటన**

**జర్నలిస్ట్ డైరీ, స్పెషల్ డెస్క్(ఏప్రిల్ 02):** వివాదాస్పద స్వామిజీ 47 ఏళ్ల నిత్యానంద చనిపోయారనే ప్రచారాన్ని ఆయన స్థాపించిన 'కైలాస' దేశం ఖండించింది. నిత్యానంద బతికే ఉన్నారని, ఆరోగ్యంగానే ఉన్నారని ఓ ప్రకటనలో తెలిపింది. ఆయన ఏప్రిల్ 2న సాయంత్రం 7 గంటలకు (న్యూయార్క్ కాలమానం) ప్రత్యక్ష ప్రసంగం చేస్తారని వెల్లడించింది. కాగా, హిందూ ధర్మ పరిరక్షణకు నిత్యానంద ప్రాణ త్యాగం చేశారని ఆయన మేనల్లుడు సుందరేశ్వరన్ చెప్పినట్టుగా ఏప్రిల్ 1న వార్తలు వచ్చాయి.




## స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై
# రోజుకో ట్విస్ట్

**జర్నలిస్ట్ విశాఖపట్టణం, (ఏప్రిల్ 2)** : వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రవేటీకరణపై రోజుకో ట్విస్ట్ వెలువడుతూనే ఉంది. ఇటీవలే స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణపై తమ స్టాండ్ ఏమీ మారలేదు అంటూ కేంద్రం స్పష్టం చేసిన విషయం తెలిసిందే. దీనిపై అక్కడి కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేశాయి. అయితే లేటెస్ట్ గా విశాఖ ఉక్కు పరిశ్రమను బలోపేతం చేసే అంశంపై ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కేంద్ర బృందం భేటీ అయింది. వైజాగ్ స్టీల్ ప్లాంట్ బలోపేతానికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నాయని ఏపీ ప్రభుత్వం తెలిపింది. ఈ మేరకు భారత ప్రభుత్వ ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో ముఖ్యమంత్రి నివాసంలో చర్చలు జరిపింది. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం వైజాగ్ స్టీల్ ప్లాంట్ బలోపేతానికి ప్యాకేజీని మంజూరు చేసిన తర్వాత తదనంతర పరిణామాలపైనా, తీసుకోవాల్సిన చర్యలపైనా ప్రధానంగా చర్చ జరిగింది. సమావేశంలో పాల్గొన్న కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ... రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం(ఎస్పీఎఫ్)తో ప్లాంట్‌కు భద్రత కల్పించడానికి రాష్ట్రప్రభుత్వం ముందుకొచ్చినందుకు ఆయన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు స్టీల్ ప్లాంట్ పురోగతిని క్రమం తప్పకుండా సమీక్షించడం, ప్రస్తుతం పనిచేస్తున్న 2 బ్లాస్ట్ ఫర్నేసులతో పాటు, 3వ ఫర్నేస్‌ను కూడా తిరిగి ప్రారంభించడం వంటి అంశాలను ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి చర్చించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ తో తమ రాష్ట్రానికి భావోద్వేగ అనుబంధం ఉందని, దీనిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. స్టీల్ ప్లాంట్ బలోపేతం చేసేందుకు తమ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని, ఆర్థిక సాయం ప్రకటించినందుకు ప్రధాని నరేంద్రమోదీకి, కేంద్రానికి ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు.వైజాగ్ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు రెండూ సమన్వయంతో కలిసి పనిచేయాలని, ఉక్కు కర్మాగారానికి తిరిగి పూర్వ వైభవం తీసుకురావాలని చెప్పారు. ఇందుకు అవసరమైన సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తూనే ఉంటుందని హామీ ఇచ్చారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ నిర్వహణ వ్యయం తగ్గించుకోవడంతో సమర్థత, సామర్థ్యం పెంచుకోకపోతే ఆశించిన ఫలితాలు రావని అధికారులతో ముఖ్యమంత్రి అన్నారని ఆయన కార్యాలయం తెలిపింది. ఈ సమావేశంలో ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్, జాయింట్ సెక్రటరీ అభిజిత్ నరేంద్ర, ఎన్ఎండీ సీఎండీ అమితవ ముఖర్జీ, ఆర్ఐఎన్ఎల్ ఇన్చార్జ్ సీఎండీ అజిత్ కుమార్ సక్సేనా, మెకాన్ సీఎండీ ఎస్కే వర్మ, ఎంఎస్‌టీసీ లిమిటెడ్ సీఎండీ మనోబేంద్ర ఘోషల్ పాల్గొన్నారు.

కావలసింది కాప్టివ్ మైన్ : కార్మిక సంఘాలు

వైజాగ్ స్టీల్ ప్లాంట్ను బలోపేతం చేయడం పై ప్రభుత్వాలు ముందుకు రావడం సంతోషమే అయినా వైజాగ్ స్టీల్ ప్లాంట్ బతకాలంటే దానికంటూ ప్రత్యేకమైన గనుల కేటాయింపు జరగాల్సిందేనని వైజాగ్ స్టీల్ ప్లాంట్ ఉద్యోగ కార్మిక సంఘాలు అంటున్నాయి. ప్యాకేజీలతో తాత్కాలికంగా అప్పులు తీరినా శాశ్వతం గా స్టీల్ ప్లాంట్ లాభాల్లోకి రావాలంటే ముడి ఖనిజ కేటాయింపు మాత్రమే మార్గమని వారు చెబుతున్నారు. ప్రభుత్వాలు కూడా అదే మాట చెబుతున్నాయి. ప్రభుత్వ కార్యాచరణ కూడా ఆ దిశగానే ఉండాలని ఆంధ్ర ప్రజల కోరిక.




## ఆధార్ ప్రత్యేక క్యాంపులు
## రేపటి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా

**చిన్నారుల తల్లిదండ్రులు సదావకాశాన్ని వినియోగించుకోవాలి**

**జర్నలిస్ట్ డైరీ, డెస్క్ (ఏప్రిల్ 2):** రాష్ట్ర వ్యాప్తంగా ఆధార్ ప్రత్యేక క్యాంపులు ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మరలా 8 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ పేర్కొంది. పెండింగ్‌లో ఉన్న 06 సంవత్సరాల వయసు గల చిన్నారులందరూ ఈ సదావకాశాన్ని వారి తల్లి దండ్రులు వినియోగించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఆ శాఖ డైరెక్టర్ శివప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 06 సంవత్సరాల వయసు గల చిన్నారుల్లో 1,95,735 మందికి జనన ధ్రువీకరణ సర్టిఫికెట్లు ఉండగా, వీరందరూ ఇప్పటి వరకు ఆధార్ నమోదు చేయించుకోలేదు. ఆధార్ నమోదు చేయించుకోని చిన్నారుల్లో అత్యధికంగా నెల్లూరు జిల్లాలో 12,218 మంది, అత్యల్పంగా అన్నమయ్య జిల్లాలో 4,001 మంది చిన్నారులున్నారు. ఆధార్ క్యాంపులను విజయవంతం చేసేందుకు జిల్లా యంత్రాంగం కృషి చేయాలని శివప్రసాద్ పిలుపునిచ్చారు.

## ఎమ్మెల్సీగా నాగబాబు ప్రమాణం



**జర్నలిస్ట్ డైరీ, (ఏప్రిల్2):** ఆంధ్రప్రదేశ్‌లో ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీగా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి నాగబాబు ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం అందరికీ తెలిసిందే. ఈ రోజు ఆయన ఎమ్మెల్సీగా ప్రమాణ స్వీకారం చేశారు ఏపీ శాసనమండలి చైర్మన్ మోషేన్ రాజు, నాగబాబుతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమం మండలి చైర్మన్ కార్యాలయంలో జరగగా, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు, జనసేన నేతలు హాజరయ్యారు. భారత రాజ్యాంగం పట్ల నిజమైన విశ్వాసం, విధేయతను ప్రదర్శిస్తానని, భారతదేశ సార్వభౌమాధికారాన్ని, సమగ్రతను కాపాడతానని నాగబాబు ప్రమాణం చేశారు. తర్వాత నాగబాబు తన సతీమణి పద్మజతో కలిసి ముఖ్యమంత్రి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎం కార్యాలయానికి వెళ్లిన నాగబాబు దంపతులు చంద్రబాబుకు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా చంద్రబాబు, నాగబాబుకు శుభాకాంక్షలు తెలియజేసి, ఆయనకు శాలువా కప్పి వెంకటేశ్వరస్వామి ప్రతిమను బహూకరించారు.ఇదిలా ఉండగా నాగబాబు ఎమ్మెల్సీగా బాధ్యతలు స్వీకరించిన నేపథ్యంలో జనసేన శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. పార్టీకి ఇది మరింత బలాన్ని చేకూరుస్తుందని నేతలు అంటున్నారు. శాసన మండలిలో జనసేన శబ్దం ఎలా ఉంటుందో వేచి చూడాలి.

## ప్రియుడికోసం
## ముగ్గురు పిల్లలను చంపేసింది

**పెరుగన్నం తినకుడా బతికిపోయిన భర్త**
**సంగారెడ్డి జిల్లాలో దారుణం**

**జర్నలిస్ట్ డైరీ, సంగారెడ్డి, (ఏప్రిల్2):** అమీన్ పూర్ పిల్లల హత్య కేసులో సంచలన విషయాలు బయటపడ్డాయి. తల్లి రజిత ప్రియుడుతో బతకాలని ఆశతో పిల్లల్ని చంపింది. భర్త చెన్నైయతోపాటు పిల్లల్ని చంపాలని ప్లాన్ వేసింది. పెరుగులో విషం కలిపి భర్త పిల్లల్ని చంపాలని ప్లాన్ చేసింది. అయితే చెన్నయ్య పెరుగు తినకుండా భోజనం చేసి డ్యూటీ కి వెళ్లాడు. విషంతో కూడిన పెరుగన్నం తినడంతో పిల్లలు ముగ్గురు మృతి చెందారు. భర్త బతికిపోయాడు. ఉదయం భర్త ఇంటికి రాగానే కడుపునొప్పి అంటూ రజీత నాటకమాడింది. అప్పటికే పిల్లలు మృతి చెందడంతో భార్యను ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. ముగ్గురు పిల్లల్ని చంపిన రజితను పోలీసులు అరెస్టు చేసారు. ఇటీవల టెన్త్ క్లాస్ విద్యార్థుల గెట్ టూ గెదర్ పార్టీలో స్నేహితుడితో రజితకి పరిచయం ఏర్పడింది. చిన్ననాటి మిత్రుడితో రజీత వివాహేతర సంబంధాన్ని ఏర్పరచుకుంది. ప్రియుడితో కలిసి జీవించాలని ఘాతుకానికి పాల్పడింది. గత నెల 27న రాత్రి భోజనం చేసేటప్పుడు పెరుగులో విషపదార్థం కలిపింది. ముగ్గురు పిల్లలు సాయికృష్ణ(12), మధు ప్రియ(10), గౌతమ్(08) మృతి చెందారు. కడుపు నొప్పిగా ఉందని భార్య రజిత చెప్పడంతో భర్త చెన్నయ్య ఆస్పత్రిలో చేర్పించాడు. పోలీసులు మొదట భర్త చెన్నయ్యపై అనుమానం వ్యక్తం చేసారు. కానీ రజిత భాగోతం విచారణలో బయటపడింది.

# ఇది రాజ్యాంగ వ్యతిరేక బిల్లు: వైఎస్ షర్మిల

**జర్నలిస్ట్ డైరీ డెస్క్, (ఏప్రిల్2):** ముస్లింలకు రాజ్యాంగం ఇచ్చిన మత స్వేచ్ఛను హరించడానికే వక్ఫ్ సవరణ బిల్లు. ఇది మైనారిటీలను అణిచివేసే కుట్ర. రాజ్యాంగ వ్యతిరేక బిల్లని ఏపీసీసీ ఛీఫ్ షర్మిలా రెడ్డి అన్నారు. దేశ వ్యాప్తంగా ముస్లింల మనోభావాలు దెబ్బతీయడమే నియంత మోడీ అజెండా. పార్లమెంట్ ముందుకు సవరణ బిల్లు రావడం అంటే ఈ దేశానికి ఇవ్వాళ బ్లాక్ డే. దేశ చరిత్రలో ఒక మాయని మచ్చగా మిగిలిపోయే ఒక చర్య. ఈ బిల్లు ద్వారా మత విద్వేషాలు రెచ్చగొట్టడం తప్పా మరొకటి కాదు. వక్ఫ్ ఆస్తులను అన్యాక్రాంతం చేయడం కోసమే ఈ పన్నాగామని అన్నారు. దేవుడికి ఇచ్చిన ఆస్తిని కాజేసి మోడీ బినామీలకు, మోడీ దోస్తులకు వక్ఫ్ ఆస్తులను దారాదత్తం చేసే కుట్ర. వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ దేశంలో 20 కోట్ల మంది ముస్లింలు ఆందోళనలు చేస్తున్నా. వారి వేదన వినకుండా బిల్లును చట్టసభల్లో ప్రవేశపెట్టడం ప్రజాస్వామ్య విద్రోహ చర్య. వారి ఆవేదనను పరిగణనలోకి తీసుకోకపోవడం మోడీ నియంతృత్వ విధానానికి నిదర్శనం. వక్ఫ్ ఆస్తుల పర్యవేక్షణ కలెక్టర్లకు అప్పగించడం, వక్ఫ్ బోర్డులో అన్యమత సభ్యులను నియమించడం, వక్ఫ్ ఆస్తులు 12 ఏళ్ళుగా ఎవరి అధీనంలో ఉంటే వారివే అనడం, 300 ఏళ్ల క్రితం నాటి ఆస్తులకు ఇప్పుడు డాక్యుమెంట్లు అడగడం, వక్ఫ్ బోర్డుకి భూములు వితరణ చేయాలంటే 5 ఏళ్లు ఇస్లాం ధర్మాన్ని ఆచరించాలని.. నిబంధన పెట్టడం అంటే ముస్లింల మనోభావాలను దెబ్బతీసే వ్యతిరేక చర్యలేనని అన్నారు. మైనారిటీల ప్రయోజనాలను దెబ్బతీసే బిల్లుకు టీడీపీ,జనసేన పార్టీలు మద్దతు పలకడం దారుణమన్నారు. టీడీపీ సెక్యులర్ పార్టీ ముసుగు తొలిగింది. చంద్రబాబు మోసం బయటపడింది. ముస్లింలకు ఇఫ్తార్ విందులు ఇచ్చి, వక్ఫ్ ఆస్తులను కాపాడుతామని హామీలు ఇచ్చి, మరోపక్క పార్లమెంట్ లో సవరణ బిల్లుకు మద్దతు పలకడం పచ్చి మోసం. వక్ఫ్ సవరణ బిల్లుకు మద్దతు ఇవ్వాలని విప్ జారీచేసిన చంద్రబాబు ఒక ముస్లిం ద్రోహి. ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ పక్షాన ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు.





సాయుధ రైతాంగ పోరాట

# తొలి అమరుడు

**నిజాం నిరంకుశ పాలనను ఎదిరించిన వీరుడు**

**దొడ్డి కొమురయ్య జయంతి నేడు**

నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా భూమి కోసం భుక్తి కోసం వెట్టిచాకిరి విముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో అసువులు భాసిన తొలి అమరుడు మన దొడ్డి కొమురయ్య. హైదరాబాద్ సంస్థానాధీశుడు ఏడవ నిజాం నవాబు ఉస్మాన్ ఆలీ ఖాన్ నుంచి విముక్తి కోసం సంస్థాన ప్రజలు 1946 నుంచి 1948 మధ్య వీరోచిత పోరాటం చేశారు. దీన్నే తెలంగాణ విమోచనోద్యమంగా పిలుస్తారు. తెలంగాణ సాయుధ పోరాటం చరిత్ర వినగానే మొదటగా గుర్తొచ్చేది తెలంగాణ సాయుధ పోరాట రైతాంగ వీరుడు తొలి అమరుడు దొడ్డి కొమరయ్య. 03 ఏప్రిల్ 1927లో వరంగల్లు జిల్లా దేవరుప్పుల మండలం కడవెండి గ్రామంలో సాధారణ గొర్రెల పెంపకందార్ల కుటుంబములో జన్మించాడు.

ఇతని అన్న దొడ్డి మల్లయ్య కమ్యూనిస్టు పార్టీ గ్రామ నాయకుడు. విసునూర్ దేశ్‌ముఖ్ రామచంద్రా రెడ్డి తల్లి జానకమ్మా దొరసాని. ఆమె కడికవెండిలో వుండేది. ఈమె ప్రజల పట్ల అతి క్రూరంగా వ్యవహరించేది. మనషులను వెట్టిచాకిరి చేయించడంలో వడ్డీలు వసూలు చేయడంలో రకరకాల శిక్షలు, జరిమానాలు విధించడంలో పేరుగాంచింది. వెట్టి చాకిరికి దొపిడికి వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాట సేనాని ఆరుట్ల రాంచంద్రారెడ్డి, కడివెండి వెళ్లి ఆంధ్ర మహా సభ సందేశాన్ని ప్రజలకు వినిపించాడు. దీంతో గ్రామంలో సంఘమేర్పడింది. ఉత్సాహంగా యువతీ యువకులు ముందుకొచ్చారు. దిన దినంగా కడివెండిలో సంఘం బలంగా అయింది. వెట్టచాకిరిని నిర్మూలించారు. దొరలు, విసునూర్ ల ఆటలను అరికట్టించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిననూ నిజాం సంస్థానంలోని ప్రజలకు మాత్రం స్వాతంత్ర్యం లేకపోవడాన్ని ఇక్కడి ప్రజలు జీర్ణించుకోలేక పోయారు.

దేశమంతటా స్వాతంత్ర్యోత్సవాలతో ప్రజలు ఆనందంతో గడుపుచుండగా నిజాం సంస్థాన ప్రజలు మాత్రం నిరంకుశ బానిసత్వంలో కూరుకుపోయారు.1946 జులై 2 న విసునూర్ నైజాం అల్లరి మూకలు రౌడీలతో 40 మంది వచ్చారు. ప్రజలంతా ఏకమై కర్రలు, బడిశెలు, గునపాలు అందుకుని విసునూర్, నిజాం, రజాకర్లను తరిమికొట్టారు. కడివెండి గ్రామంలో 1946 జులై 4న దేశ్‌ముఖ్ తొత్తులకు, రజాకార్లకు వ్యతిరేకంగా గుత్పల సంఘం తిరుగుబాటు లేవదీసింది. మల్లయ్య, కొమురయ్య నాయకత్వంలో ఆ తిరుగుబాటు ముందుకు సాగింది. మల్లయ్య, కొమురయ్యలను మట్టుబెడితే ఉద్యమం ఆపేయవచ్చునని జానకమ్మ దొరసాని ఆలోచించింది. దొరలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఊరేగింపుగా గడీ దగ్గరకు ర్యాలీ రాగానే రజాకార్లు, దొర బంట్లు గడీ లోపలి నుంచి జనంపైకి కాల్పులు జరిపారు.

తొలుత దొడ్డి మల్లయ్య మోకాళ్లలో, మంగళి కొండయ్య నుదుట, దొడ్డి నర్సయ్య మోచేతి గుండా తూటాలు వెళ్లాయి. దొడ్డి కొమురయ్య పొట్టను చీల్చుకుంటూ తూటాలు పోవడంతో రక్తపు మడుగులో అతను నేలకొరిగాడు. కొమురయ్య రక్తంతో అక్కడి నేలంతా తడిచింది. నైజాం అల్లరి మూకలు, విసునూర్ తుపాకి తూటాలకు నేలరాలిన అరుణతారగా తెలంగాణ విప్లవంలో చెరగని ముద్రవేసుకున్నాడు దొడ్డి కొమురయ్య. మరణ వార్త జనగాం ప్రాంత ఆంధ్రమహాసభ కార్యకర్తలందరకీ విషాదకరమైన వార్తయింది. దేశ్‌ముఖ్, విసునూర్ ఆగడాలన ఎదుర్కోవవడానికి పాలకుర్తి ప్రాంతం నుంచి యాదగిరిరావు, నిర్మల్ కృష్ణమూర్తి, నాయకత్వంలో ఆరు వేల మంది ప్రజాసైన్యం బయలుదేరింది. అప్పటి వరకూ శాంతియుతంగా సాగిన తెలంగాణ విముక్తి పోరు కాస్తా కొమురయ్య అమరత్వంతో రక్తానికి రక్తం.. ప్రాణానికి ప్రాణం.. అనే నినాదంతో సాయుధ పోరాటంగా మారింది.

కొమురయ్య మరణంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి జనం పోటెత్తడంతో దొరల గడీ నేలమట్టమైంది. కొమురయ్య త్యాగంతో మొదలైన పోరాటం హైదరాబాద్ రాష్ట్రవ్యాప్తంగా విస్తరించింది. ఆంధ్ర మహాసభ కమ్యునిస్టు పార్టీగా అవతరించింది. ఎందరో నేతలు రైతులతో భుజంభుజం కలిపి తుపాకులు పట్టారు. దున్నేవాడిదే భూమి నినాదం మార్మోగింది. లక్షల ఎకరాల భూమి లేని పేదలకు పంచబడ్డాయి.

పెండ్యాల రామ్ కుమార్, మంథని

# ఓటమి ఎరుగని ధీరుడు

**హిందూ సామ్రాజ్య స్థాపకుడు**

**ఛత్రపతి శివాజీ మహారాజ్ వర్ధంతి నేడు**



ఓటమి ఎరుగని ధీరుడు, హిందూ సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్. క్రీ.శ. ఫిబ్రవరి 19, 1630వ సంవత్సరం వైశాఖమాసపు శుక్లపక్ష తదియనాడు పూణే జిల్లాలోని జున్నార్ పట్టణం దగ్గర గల శివనేరి కోటలో శహాజీ, జిజాబాయి పుణ్యదంపతులకు జన్మించాడు. వీరు మహారాష్ట్రలోని వ్యవసాయ కున్బీ కులానికి చెందినవారు. జిజాబాయికి శంభాజీ తర్వాత పుట్టిన కొడుకులు అందరూ మృతి చెందగా ఆమె పూజించే దేవత అయిన శివై (పార్వతి) పేరు శివాజీకు పెట్టింది.


శివాజీ తండ్రి షాహాజీ నిజాంషాహీల ప్రతినిధిగా పనిచేస్తూ మొఘల్ రాజులకు వ్యతిరేకంగా అనేక యుద్ధాల్లో పాల్గొన్నాడు. షాజహాన్ దండయాత్ర చేసిన సమయంలో కీలకపాత్ర పోషించాడు. తన సహచరుడిని నిజాంషాహీ ప్రభువు హత్యచేయించడంతో తిరుగుబాటు బావుటాను ఎగురవేసి స్వతంత్ర మరాఠా సామ్రాజ్య స్థాపనకు నాంది పలికాడు. రాజ్య విస్తరణ కోసం చేసిన యుద్దాలలో పరాజయాన్ని చవిచూశాడు. తండ్రి వద్ద యుద్ధవిద్యలు, రాజనీతి మెలుకువలు నేర్చుకున్న శివాజీ తండ్రి పరాజయాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి అనేక నూతన యుద్ధతంత్రాలను రూపొందించాడు.

సకలవిద్యలను అవపోసన పట్టిన ఆయన మరాఠాసామ్రాజ్య స్థాపనే లక్ష్యంగా తన వ్యూహాలను రచించాడు. 17 సంవత్సరాల వయస్సులోనే సుల్తానులలో యుద్ధాలకు తలపడిన శివాజీ బిజాపూర్ సామ్రాజ్యానికి చెందిన తోర్నా కోటను సొంతం చేసుకున్నాడు. యుద్ధ భయంకరుడుగా పేరుపొందిన అఫ్జల్‌ఖాన్ శివాజీ మెరుపు దాడులు, గెరిల్లా యుద్ధ పద్దతులు తెలుసుకుని ఆయనను రెచ్చకొట్టేలా శివాజీకి ఇష్టదైవమైన భావానీదేవి ఆలయాన్ని కూల్చివేశాడు. అఫ్జల్ కుట్రలు తెలుసుకున్న శివాజీ ప్రతాప్‌ఘడ్ కోట లోసమావేశానికి అంగీకరిస్తాడు, ముందు జాగ్రత్తగా ఉక్కుకవచాన్ని ధరించి పిడిబాకును దాచుకుని చర్చలకు సిద్ధమవుతాడు.

శివాజీ ని అంతమొందించడమే లక్ష్యంగా పెట్టుకున్న అఫ్జల్ కత్తితో శివాజీపై దాడి చేస్తాడు, ఉక్కు కవచం కారణంగా రక్షించబడిన శివాజీ వెంటనే పిడిబాకులో దాడిచేస్తాడు, సైనికాధికారి చేతిలో అఫ్జల్ ఖాన్ మరణించగా మెరుపుదాడుల్లో సైనాన్ని మట్టికరిపిస్తాడు. ప్రతాప్ ఘడ్ యుద్ధంతో శివాజీ కీర్తిప్రతిష్టలు భారతదేశమంతటా వ్యాపిస్తాయి. ఎందరో హిందూ రాజులు ఆయన కు సంఘీభావం తెలియజేస్తారు. అఫ్జల్‌ఖాన్ మరణాన్ని సహించలేని బిజాపూర్ సుల్తాన్ పదివేలమంది అతిబలవంతులైన సైనికులను శివాజీని అంతమొందించడానికి పంపిస్తాడు. ఐదు వేలమంది మరాఠాయోధులతో హరహరమహా దేవ అంటూ విజృంభించిన శివాజీ వారిని ఊచకోతకోశాడు.

శివాజీ పరాక్రమాలను తెలుసు కున్న మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు ముందుజాగ్రత్తగా అపారమైన సైనికశక్తిని, సిద్ది జోహార్ అనే సైనికాధ్యక్షుడిని కొల్హాపూర్‌లో మోహ రిస్తాడు. సమీపంలోని పన్‌హాలా కోటలో వందలమంది అనుచరులతో ఉన్న శివాజీ విషయం తెలుసుకుని కోటనుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తాడు. ఈ యుద్ధంలో అతిఎక్కువమంది సైనికులను కోల్పోయిన శివాజీ సంధికి అంగీకరిస్తాడు. ఈ సంధిలో భాగంగా శివాజీ సామ్రాజ్యం స్వతంత్ర్య రాజ్యంగా గుర్తింపు, సిద్ది జోహార్ విజయానికి బహుమతిగా పన్‌హాలా కోట దక్కింది. సుల్తానులతో శివాజీ చేసిన ఆఖరు పోరు పవన్ ఖండ్ యుద్ధం. శివాజీతో యుద్ధంలో ఎలాగైనా విజయం సాధించాలన్న లక్ష్యంతో ఔరంగజేబు తన మేనమామ షాయిస్తాఖాన్ వెంట లక్షకు పైగా సైన్యాన్ని, ఆయుధాలను ఇచ్చి దక్కన్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకోవాలని ఆదేశిస్తాడు. అయితే మొగల్‌సేనల ముందు మరాఠి సేనలు నిలువలేక పోతారు. ఓటమిని అంగీకరించిన శివాజీ పూణే వదిలి వెళ్లిపోతాడు. శివాజీ నిర్మించిన లాలామహల్ లో షాయిస్తాఖాన్ నివాసం ఏర్పాటు చేసుకుని, శివాజీ దాడి నుంచి ముందస్తుజాగ్రత్తగా పూణే నగరమంతా కట్టుదిట్టమైన భద్రతను ఏర్పాట్లు చేసుకుంటాడు. మారువేషంలో వచ్చిన శివాజీ షాయిస్తాఖాన్ గదిలోకి చేరి కత్తితో దాడి చేస్తాడు. గాయపడిన ఖాన్ సైనికుల సహాయంలో ప్రాణాలు దక్కించుని ఔరంగజేబు వద్దకు చేరుతాడు. తిరిగి తన కోటను స్వాధీనం చేసుకున్న శివాజీ సూరత్ నగరం పై దాడి చేసి అపారమైన ధనాన్ని, ఆయుధాలను దోచుకుని తన సైన్యాన్ని బలోపేతం చేసుకుని క్రమంగా మొఘలుల, బీజాపూర్ సుల్తానుల కోటలను ఒక్కొక్కటిగా స్వాధీనం చేసుకుంటాడు. మొఘల్ సర్దార్‌గా ఉండడానికి అంగీకరించి 23కోటలను, నాలుగు లక్షల రూపాయలను చెల్లిస్తాడు. ఔరంగజేబు తన పుట్టినరోజు సందర్భంగా శివాజీని , అతని ఆరేళ్ల కొడుకు శంభాజీని ఆహ్వానించి నిండుసభలో అవమానపరుస్తాడు. మరాఠీల తిరుగుబాటుకు బయపడి శివాజీని హతమర్చకుండా అతిధిగృహంలోనే బందీచేస్తాడు. చాకచాక్యంతో అక్కడినుంచి తప్పించుచున్న శివాజీ రహస్యంగా తన కార్యకలాపాలు నిర్వహిస్తూ 1674 నాటికీ లక్షమంది సుశిక్షితులైన సైన్యాన్ని, ఆయుధాలను, అశ్వాలను, గుఢాచారి వ్యవస్థను, నౌకావ్యవస్థను ఏర్పాటుచేసుకుంటాడు. శ్రీశైలం వచ్చి అక్కడ భవానీదేవిని ధ్యానిస్తాడు. ఆయన భక్తికి మెచ్చిన దేవి ప్రత్యేక్షమై ఖడ్గాన్ని ప్రసాదిస్తుంది.(ఇప్పటికీ ఆ ఖడ్గం మ్యూజియంలో ఉంది.) మరాఠ సామ్రాజ్యాన్ని విస్తరించాలన్న ఆకాంక్ష, దేవి ఆశీస్సులు ఉన్న ఖడ్గంతో శివాజీ ఎన్నో కోటలను సులువుగా స్వాధీనం చేసుకున్నాడు. కొండ కోట ను స్వాధీనం చేసుకోవడానికి అత్యంత గొప్ప సైనికాధికారిగా పేరు తెచ్చుకున్న తానాజీని పురమాయిస్తాడు శివాజీ. కోట నిర్మాణాన్నిక్షుణ్ణంగా పరిశీలించిన తానాజీ యశ్వంతి అనే ఉడుముకు తాడు కట్టి కొండపైకి విసిరి, ఆ తాడు హాయంతో కోట లోకి ప్రవేశించి కోటను స్వాధీనం చేసుకుంటాడు. అయితే ఈ పోరులో తానాజీ మరణిస్తాడు. కోటను గెలిచాం కాని సింహాన్ని కోల్పోయామని ఆవేదన చెందిన శివాజీ ఆ కోటను సింహఘడ్ గా మార్చాడు. మరాఠాసామ్రాజ్యాన్ని వ్యాపించచేసిన శివాజీకి రాయఘడ్ కోటలో వేద పఠనాల మధ్య క్షత్రియరాజులందరికీ అధిపతిగా కీర్తిస్తూ ఛత్రపతి బిరుదును ప్రదానం చేస్తారు. ఎన్నో కోటలపై దండయాత్రలు చేసిన శివాజీ ఏ మతానికి చెందిన పవిత్రస్థలాలను ధ్వంసం చేయలేదు. మొగలులకు, సుల్తాన్‌లకు వ్యతిరేకంగా పోరాటం చేసిన ఆయన కొలువులో అనేకమంది ముస్లీంలు ఉండేవారు. సైన్యంలో మూడొంతులు ముస్లింలే. శివాజీకి సర్వసైన్యాధ్యక్షులుగా దౌలత్‌ఖాన్, సిద్ధిక, నావికాదళానికి ఇబ్రహీం ఖాన్, మందుగుండు విభాగానికి అధ్యక్షుడుగా సిద్ది ఇబ్రహీం బాధ్యతలు నిర్వహించేవారు. పరస్త్రీలను మాతృ సమానురాలుగా చూసిన గొప్ప వ్యక్తి శివాజి. గెరిల్లా విధానంలో పోరాటం, కొత్త ఆయుధాలను కనుగొవడం శివాజీ అవలంభించిన యుద్ధవైపుణఅయాలే. 27 సంవత్సరాల పాటు సుదీర్ఘకాలం అనేక యుద్ధాలు చేస్తూ మూడువందల కోటలను తన ఆధీనంలో ఉంచుకుని, లక్షమంది సైన్యాన్ని తయారు చేసిన శివాజీ కొండలపై సాంకేతిక విలువలతో శత్రుదుర్భేధ్యమైన కోటలను నిర్మించడంలో ప్రపంచఖ్యాతి ని సొంతం చేసుకున్నాడు. నాసిక నుంచి మద్రాసు వరకు 1200 కిలోమీటర్ల మధ్య 300 కోటలు నిర్మించాడు.

**- పెండ్యాల రామ్ కుమార్, మంథని**






పేదోడి ఆకలి తీర్చే

# చరిత్రాత్మక నిర్ణయం

**చందానగర్ డివిజన్ పరిధిలో సన్నబియ్యం పంపిణీ**

**శేరిలింగంపల్లి అభివృద్ధికి కట్టుబడి ఉన్నా**

**పీఏసీ చైర్మన్ గాంధీ**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో (ఏప్రిల్ 02):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సన్నబియ్యం పథకంలో భాగంగా చందానగర్ డివిజన్ పరిధిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ మున్సిపల్ కల్యాణ మండపంలో పేదవారికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సన్నబియ్యాన్ని పీఏసి చైర్మన్ గాంధీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రతిమ సింగ్, MBC చైర్మన్ జేరిపేటి జైపాల్, కార్పొరేటర్లు మంజుల రఘునాథ్ రెడ్డి, దొడ్ల వెంకటేష్ గౌడ్, ఉప్పలపాటి శ్రీకాంత్, నార్నె శ్రీనివాసరావు, DSO శ్రీ శ్రీనివాస్, ASO పుల్లయ్య, DM గోపి కృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా PAC చైర్మన్ గాంధీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న చరిత్రాత్మక నిర్ణయం అన్నారు. నిరుపేదల కడుపు నింపడమే ప్రభుత్వ ధ్యేయం అని, ఆకలితో అలమటించే పేదవాడికి సన్న బియ్యం అందించడం ద్వారా ఎంతో పుణ్యం కలుగుతుంది అన్నారు. రాష్ట్రంలోని 3 కోట్ల 10 లక్షల మందికి ఆరు కిలోల సన్నబియ్యం అందచేయనున్నట్టు తెలిపారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్దే తన ధ్యేయమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు ,లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# అప్పలరాజును వెంటాడుతున్న కేసులు

**జర్నలిస్ట్ డైరీ, శ్రీకాకుళం, (ఏప్రిల్ 2):**
శ్రీకాకుళం జిల్లాలో రాజకీయం అంతా ఇప్పుడు సీదిరి అప్పలరాజు చుట్టూనే నడుస్తోంది. ఒకప్పుడు మంత్రిగా ఉన్న ఆయన ఇప్పుడు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిరగాల్సి వస్తోంది. మాజీ మంత్రి, పలాస నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ సీదిరి అప్పలరాజును పోలీస్ కేసులు వెంటాడుతున్నాయి. తాజాగా ఆయనపై కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. ఢిల్లీరావు అనే వ్యక్తి అనుమానాస్పద మృతి కేసు దర్యాప్తులో జాప్యం జరుగుతుందంటూ శుక్రవారం పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేసినందుకుగాను కేసు నమోదు చేశారు పోలీసులు. విధులకు ఆటంకం కలిగించారంటూ అప్పలరాజుతో పాటు మరో 16 మందిపై కేసు నమోదు చేశారు.రాష్ట్రంలో ఎప్పుడూ పొలిటికల్ హీట్ తో రగిలిపోయే నియోజకవర్గాలలో పలాస నియోజకవర్గం ఒకటి. ఇక్కడ ఏ పార్టీ అధికారంలో ఉన్న నిత్యం ఏదో ఒక అంశంపై రచ్చ జరుగుతూ వార్తలలో ఉంటుంది ఈ నియోజకవర్గం. రాజకీయ ఆరోపణలు, ప్రత్యారోపణలు పక్కన పెడితే ఇక్కడి నేతలను పోలీసు కేసులు వెంటాడుతూ ఉంటాయి. ప్రతిపక్ష వైసీపీకి చెందిన మాజీ మంత్రి సీదిరి అప్పలరాజుపై కూటమి ప్రభుత్వం వచ్చాక మూడు కేసులు నమోదయ్యాయి. వీటికి తోడు ఇప్పుడు తాజాగా మరో కేసు నమోదు కావడంతో కేసుల సంఖ్య నాలుగుకి చేరింది. తాజాగా పోలీసుల విధులకు ఆటంకం కల్పించారంటూ శ్రీకాకుళం జిల్లా కాశిబుగ్గ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు చేశారు.పలాస మండలం నీలావతికి చెందిన ఢిల్లిరావు అనే పౌర హక్కుల సంఘం నేత అనుమానాస్పద మృతి కేసు విషయమై శుక్రవారం (మార్చి 28) మృతిని భార్య కమల, గ్రామ పెద్దలతో కలిసి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ ముందు బైఠాయించి ధర్నా చేశారు. ఢిల్లీ రావు మృతికి కారణం ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. 3 నెలలు గడిచినా ఇప్పటికీ పోలీసులు మృతికి కారణం ఏంటనేది చెప్పలేకపోతున్నారని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో పోలీసులకు, మాజీ మంత్రికి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దర్యాప్తు వేగవంతం చేసి నెల రోజుల్లో ఢిల్లి రావు మృతికి కారణం ఏంటనేది స్పష్టం చేస్తామని చివరకు



పలాస DSP వెంకట అప్పారావు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు అప్పలరాజు.అయితే అదే రోజు అదే పోలీస్ స్టేషన్ లో ఎస్పీ మహేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో గ్రీవెన్స్ జరగాల్సి ఉంది. కాసేపటిలో కాశీబుగ్గ పోలీస్ స్టేషన్ కి SP చేరుకుంటారనగా మాజీ మంత్రి అప్పలరాజు నిరసనకు దిగారు. దీంతో గుంపుగా ధర్నా చేపట్టి పోలీసుల విధులకు ఆటంకం కలిగించారంటూ అప్పలరాజుతో సహా మరో 16 మంది పైన పోలీసులు కేసు నమోదు చేశారు. ఇప్పటికే సీదిరి అప్పలరాజుపై కూటమి ప్రభుత్వం వచ్చాక వివిధ అభియోగాలపై జిల్లాలో మూడు కేసులు నమోదు కాగా తాజాగా ఇపుడు ఆయనపై మరో కేసు నమోదయింది.తనపై పోలీసులు తాజాగా మరో కేసు నమోదు చేయటంపై మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ఘాటుగానే స్పందించారు. మేము ధర్నా చేసామని మాపై FIR నమోదు చేస్తే.. ఢిల్లీ రావు మృతి చెంది మూడు నెలలైన కనీస వివరాలు వెల్లడించకుండా విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పోలీసులను ఏం చెయ్యాలని ప్రశ్నించారు. ఇది మీ రోజు.. తైతక్కలు ఆడండి మేం భరిస్తాం. కానీ మా రోజు వచ్చినపుడు మాత్రం ఇంతకన్నా గట్టిగా మీ చేత తైతక్కలాడిస్తాం అని మంత్రి పోలీసులను హెచ్చరించారు. ఈ ప్రభుత్వం వచ్చిన ఏడాదిలో తనపై నాలుగు కేసులు పెట్టారని, రానున్న నాలుగేళ్లలో ఇంకా తనపై ఎన్ని FIR లు వేయాల్సి వస్తాదో అని అన్నారు. తెప్పల ఢిల్లీరావు అనే ఉద్ధానం వాసి మృతి కేసులో నిజనిజాలు వెల్లడించండని అనేకసార్లు డిఎస్పీకి వినతిపత్రాలు ఇచ్చామన్నారు.
పోలీసులు రెండు రోజుల్లో, వారం రోజుల్లో చెబుతామని చెప్పి ఎంతకీ తేల్చకపోతే తాము వెళ్లి స్టేషన్ ముందు ధర్నా చేశామని చెప్పారు. ప్రశ్నించే వారిపై FIR లు వేస్తామంటే అదేం పరిపాలన అని మండిపడ్డారు. ప్రభుత్వ పెద్దలు, ప్రజా ప్రతినిధులు ఖచ్చితంగా గట్టిగా సమాధానం చెప్పే రోజు వస్తాదని అన్నారు. మరోవైపు, మాజీ మంత్రి అప్పలరాజు తోపాటు మరో 16 మందిపైన పోలీసులు కేసు నమోదు చేయటంపై మృతుడు ఢిల్లిరావు భార్య తెప్పల కమల సైతం స్పందించారు. 50 ఏళ్లకే నా భర్తను దారుణంగా చంపేశారని, దానిపై పోలీసుల నుండి సరైన రెస్పాన్స్ లేకపోతే ఎస్పీకి వినతి పత్రం ఇచ్చేందుకు గ్రామ పెద్దలు, మిగతా సర్పంచులతో కలిసి వెళ్ళానని కమల చెప్పారు. తనకు న్యాయం చేయండి అని ఎస్పీ కలిసి అడగడానికే తాము వెళ్ళామని చెప్పారు. తన భర్త చనిపోయాక 3నెలలుగా తాను, తన కొడుకు దిక్కులేని వారీగా ఉంటున్నామనిఆమె అవేదన వ్యక్తం చేశారు. ఇలా మాపై కేసులు పెట్టీ ఈరోజో రేపో మమ్మల్ని కూడా చంపేసేటట్టు ఉన్నారంటూ ఆందోళన వ్యక్తం చేశారు.ఇదిలావుంటే, మరో మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డికి పోలీసులు నోటీసులు పంపారు. క్వార్ట్జ్ అక్రమంగా తరలించారా? లేదా? సోమిరెడ్డి ఆరోపణల్లో నిజమెంత? స్టేషన్‌కు వచ్చి సమాధానం ఇవ్వండి అంటూ మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డికి నోటీసులు ఇచ్చారు పోలీసులు. నెల్లూరు జిల్లా తాటిపర్తిలో రుస్తుం మైన్స్ కేసులో మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డికి నోటీసు ఇచ్చిన పోలీసులు.. విచారణకు రావాలంటూ సూచించారు. నోటీసులు ఇచ్చేందుకు పోలీసులు కాకాని ఇంటికి వెళ్లిన సమయంలో ఆయన అందుబాటులో లేకపోవడంతో ఇంటి గేటుకు నోటీసులు అంటించారు.
రుస్తుం మైన్స్ కేసులో ఇప్పటికే ఏడుగురిపై FIR నమోదు చేసిన పోలీసులు ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో కాకాని పేరును A4గా చేర్చారు. పొదలకూరు మండలం తాటిపర్తి రుస్తుం మైన్స్‌లో అక్రమంగా వైట్ క్వార్ట్జ్ తరలించారంటూ 2024లో మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఫిర్యాదు చేయడంతో పాటు క్వారీ వద్ద నిరసన చేపట్టారు. ఆ కేసుకు సంబంధించి ప్రస్తుతం విచారణ చేస్తున్న పోలీసులు.. కాకాని గోవర్ధన్ రెడ్డిని విచారణకు పిలిచారు.
ఈ కేసులో కాకాని ఇప్పటికే ముందస్తు బెయిల్ కోసం దరఖాస్తు చేసినట్లు తెలుస్తోంది. తనపై తప్పుడు కేసు పెట్టారని ఇప్పటికే ఆరోపించిన కాకాని ఎలాంటి విచారణకైనా సిద్ధమని ప్రకటించారు. నోటీసులు ఇచ్చేందుకు వెళ్లిన సమయంలో కాకాని అందుబాటులో లేరు. మరి పోలీసుల నోటీసులపై ఏ విధంగా స్పందిస్తారు? విచారణకు హాజరు అవుతారా లేదా ఉన్న ఉత్కంఠ నెలకొంది.

# బీసీకి మంత్రి పదవి ఇవ్వండి

**ఉమ్మడి రంగారెడ్డికి ప్రాతినధ్యం కల్పించండి**

**టీ జేఏసీ చైర్మన్ ముకుంద నాగేశ్వర్**



**జర్నలిస్ట్ డైరీ, పరిగి(ఏప్రిల్ 2):** ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి మంత్రివర్గంలో బీసీలకు స్థానం కల్పించాలని వికారాబాద్ జిల్లా టీజేఏసీ చైర్మన్, ముకుంద నాగేశ్వర్ విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వాలలో 2004 నుంచి 2024 వరకు గాని ,ప్రస్తుత ప్రభుత్వంలో ఇప్పటివరకు పూర్వ రంగారెడ్డి జిల్లా నుంచి ఒక్కసారి కూడా బీసీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలకు, ఎమ్మెల్సీలకు మంత్రివర్గంలో స్థానం కేటాయించకపోవడం చాలా బాధాకరం అని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో, ప్రత్యేక తెలంగాణలో సబితా ఇంద్రారెడ్డి, పట్నం మహేందర్ రెడ్డి, సీహెచ్ మల్లారెడ్డి మంత్రులుగా పని చేశారని గుర్తు చేశారు. అదేవిధంగా పట్నం సునీతా రెడ్డి జెడ్పీ చైర్ పర్సన్‌గా బాధ్యతలు నిర్వహించారన్నారు. గత రెండు దశాబ్దాలుగా అత్యధిక బీసీ జనాభా ఉన్న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి బీసీల భాగస్వామ్యం చట్టసభల్లో, మంత్రివర్గంలో, జిల్లా రాష్ట్రస్థాయి పదవుల్లో శూన్యం అనీ అన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో కూడా పూర్వ రంగారెడ్డి జిల్లా నుంచి మంత్రివర్గంలో ఇప్పటివరకు బీసీలకు అవకాశం కల్పించలేదని, బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తికి మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కోరారు. అర్హులైన బీసీలకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చి మంత్రి పదవిని కేటాయించి సామాజిక న్యాయాన్ని పాటించాలని అన్నారు.



# సర్దార్ సర్వాయి పాపన్నకు ఘన నివాళి

**అంజలి ఘటించిన పీఏసీ చైర్మన్ గాంధీ**

**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో(ఏప్రిల్ 02):** బహుజన చక్రవర్తి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 315 వ వర్ధంతి సందర్భంగా మియాపూర్ డివిజన్ పరిధిలోని ఆల్విన్ X రోడ్డులో పాపన్న విగ్రహానికి పీఏసీ చైర్మన్ అరెకపూడి గాంధీ ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శతాబ్దాల కిందటే రాచరిక నిరంకుశత్వానికి వ్యతిరేకంగా పేద ప్రజలను సంఘటితం చేసి రాజకీయ , సామాజిక సమానత్వమే మూల సూత్రంగా గోల్కొండను ఏలిన బహుజన చక్రవర్తి సర్వాయి పాపన్న జీవితం అసమానం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో MBC చైర్మన్ జేరిపేటి జైపాల్ , కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, దొడ్ల వెంకటేష్ గౌడ్ , సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి , శేరిలింగంపల్లి గౌడ సంక్షేమ సంఘం అధ్యక్షులు దొంతి లక్ష్మీనారాయణ గౌడ్, ప్రధాన కార్యదర్శి కే శ్రీనివాస్ గౌడ్, కోశాధికారి పుట్ట వినయ్ కుమార్ గౌడ్, యువజన విభాగం అధ్యక్షులు బాలింగ్ గౌతమ్ గౌడ్, ప్రధాన కార్యదర్శి లీలానంద గౌడ్, కోశాధికారి నిమ్మల ధాత్రినాథ్ గౌడ్, గౌడ సంఘం ప్రముఖులు పి అశోక్ గౌడ్, యాదగిరి గౌడ్, కరుణాకర్ గౌడ్, రాచమల్ల ఓం ప్రకాష్ గౌడ్, నిమ్మల ఆనంద్ గౌడ్, మూల అనిల్ గౌడ్, ఏకాంత్ గౌడ్, లింగం గౌడ్, మల్లేష్ గౌడ్, రాములు గౌడ్, వెంకటేష్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్ గౌడ్, వీరేందర్ గౌడ్, పవన్ గౌడ్, సాయికుమార్ గౌడ్, జగన్ గౌడ్, గణేష్ గౌడ్ మరియు ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్ ,చాంద్ పాషా, జహీర్, మల్లేష్ గౌడ్, మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# కొడాలి నాని ఆపరేషన్ సక్సెస్

**జర్నలిస్ట్ డైరీ డెస్క్, (ఏప్రిల్ 2):** మాజీ మంత్రి కొడాలి నాని ఆపరేషన్ విజయవంతం అయింది. ముంబాయిలోని ఏషియన్ హార్ట్ కేర్ సెంటర్ లో సుదీర్ఘంగా నానికి సర్జరీ నిర్వహించారు. కొడాలి నానికి ఆపరేషన్ విజయవంతం కావాలని ఆయన అభిమానులు పూజలు చేసారు. ఆపరేషన్ తరువాత మాజీ సీఎం జగన్ వైద్యుల తో మాట్లాడారు. వైద్యానికి నాని రెస్పాండ్ అవుతున్నారని..కుటుంబ సభ్యులతో నాని మాట్లాడినట్లు వైద్యులు వెల్లడించారు. మూడు రోజులు వైద్యుల పర్యవేక్షణలో ఉండనున్నారు. నాని ఆపరేషన్ సక్సెస్ అయినట్లు కుటుంబ సభ్యులు వైసీపీ నేతలకు సమాచారం ఇచ్చారు.

**సర్జరీ సక్సెస్**

కొడాలి నానికి గుండె బైపాస్ సర్జరీ సక్సెస్ అయింది. ముంబాయిలోని ఏషియన్ హార్ట్ కేర్ సెంటర్ లో ఆయనకు కొద్ది సేపటి క్రితం బైపాస్ సర్జరీ పూర్తి చేసారు. దాదాపు ఎనిమిది గంటల పాటు వైద్యుల టీం ఆపరేషన్ నిర్వహించింది. కాగా, ఆపరేషన్ సక్సెస్ అయినట్లు వైద్యులు ప్రకటిం చారు. కొద్ది సేపటి క్రితమే నాని తన కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఈ విషయాన్ని ఫ్యామిలీ సభ్యులు తమ బంధువులు. పార్టీ నేతలకు వెల్లడించారు. హైదరాబాద్ ఏఐజీలో చికిత్స తీసుకు న్న నానికి వైద్యుల సూచన మేరకు ముంబైలోని ఏషియన్ హార్ట్ కేర్ సెంటర్ కు తరలించారు. అక్కడ ప్రఖ్యాత వైద్యులు చీఫ్ సర్జన్ డాక్టర్ రమాకాంత్ పాండే నేతృత్వంలో బైపాస్ సర్జరీ చేసారు.

**జగన్ ఆరా**

నాని ఆరోగ్య పరిస్థితి పైన మాజీ సీఎం జగన్ నిరంతరం వాకబు చేస్తున్నారు. ఈ ఉదయం నాని కుటుంబ సభ్యులతో జగన్ మాట్లాడారు. అటు వైద్యులు సైతం బైపాస్ తరువాత నాని కోలుకుం టారని భరోసా ఇచ్చారు. ఇప్పుడు సర్జరీ తరువాత నాని త్వరలోనే పూర్తిగా కోలుకుంటారనిాస్పత్రి వైద్యులు చెప్పుకొచ్చారు. కొద్ది రోజుల క్రితం నాని అస్వస్థతకు గురైన సమయంలో గుండె సంబంధిత పరీక్షలు చేయగా.. మూడు కవాటాల్లో సమస్య ఉన్నట్లు గుర్తించారు. తొలుత స్టంట్స్ వేయాలని భావించినా.. మూడు వాల్వ్స్ లో బ్లాకులు ఉండటంతో సర్జరీ అవసరమని నిర్ధారించారు. దీంతో, కొడాలి నానిని ప్రత్యేక ఫ్లైట్ లో ముంబాయికి తరలించారు. 2024 ఎన్నికలకు ముందు నుంచే నాని అనారోగ్య సమస్యలతో హైదరాబాద్ లో తరచూ చెకప్ చేయించుకొని చికిత్స తీసుకుంటున్నారు.

**అభిమానులు హ్యాపీ**

గత వారం ఛాతీలో నొప్పి రావటంతో ఏఐజీ ఆస్పత్రిలో చేరారు. ఆ సమయంలో చేసిన పరీక్షల్లో గుండెలోని మూడు కవాటాల్లో బ్లాకులు ఉన్నట్లు గుర్తించారు. వీటి కోసం బైపాస్ సర్జరీ చేయాల్సిన అవసరం ఉందని వైద్యులు నిర్ధారించారు. మాజీ సీఎం జగన్ వైద్యులతో మాట్లాడిన సమయంలో వెంటనే సర్జరీ చేయించాలని సూచించారు. నానికి ఆపరేషన్ సమయంలో ఆయన అభిమానులు దేవాలయాల్లో పూజలు, చర్చిల్లో ప్రార్థనలు చేశారు. నానికి చేస్తున్న సర్జరీ విజయవంతం అవ్వ టంతో పాటుగా త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఇప్పుడ సర్జరీ విజయ వంతం అయిందని సమాచారం అందటంలో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# సుహాసినికే టీటీడీపీ పగ్గాలు?

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్, (ఏప్రిల్ 2):** తెలుగుదేశం పార్టీని మరో 50 ఏళ్ల పాటు ముందుకు తీసుకెళ్లాలి అన్నది చంద్రబాబు ప్లాన్. తన వయసు రీత్యా ఆయన భవిష్యత్తు ప్రణాళిక వేస్తున్నారు. నారా లోకేష్ ను ప్రమోట్ చేస్తూనే.. నందమూరి కుటుంబాన్ని కొలుపుకెల్లాలని భావిస్తున్నారు. తద్వారా తెలుగుదేశం పార్టీ భవిష్యత్తును తీర్చిదిద్దే పనిలో పడ్డారు చంద్రబాబు ఏపీ రాజకీయాల్లో నందమూరి కుటుంబానికి ప్రత్యేక స్థానం. అటు వెండితెరను సైతం ఏలింది ఆ కుటుంబం. అయితే ఇప్పుడు నందమూరి కుటుంబం నుంచి సరైన రాజకీయ ప్రాతినిధ్యం లేదు. అదే ఆ కుటుంబ అభిమానులకు లోటు. తెలుగుదేశం పార్టీలో నందమూరి కుటుంబం ప్రాతినిధ్యం పెరగాలన్నది వారి నుంచి వస్తున్న డిమాండ్. అయితే దీనిని పరిగణలోకి తీసుకున్నారట చంద్రబాబు. అందుకే నందమూరి కుటుంబానికి కీలక బాధ్యతలు అప్పగించేందుకు సిద్ధపడుతున్నట్లు సమాచారం. మరోవైపు నందమూరి కుటుంబంలో ఉన్న విభేదాలు ఒక్కొక్కటి సమసి పోతుండగా.. తామంతా ఒక్కటేనని చెప్పేలా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మొన్నటికి మొన్న నారా లోకేష్ జూనియర్ ఎన్టీఆర్ ఫ్లెక్సీ తో హల్చల్ చేశారు. అది మరవక ముందే నందమూరి కళ్యాణ్ రామ్ టిడిపి జెండా చేత పట్టుకొని సందడి చేశారు. తద్వారా విభేదాలు అన్నవి ఊహాగానాలే తప్ప.. నిజం కాదని తేల్చి చెప్పే ప్రయత్నం చేశారు.గత కొద్దిరోజులుగా నందమూరి యువ హీరోలు జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్ లు తెలుగుదేశం పార్టీకి దూరంగా ఉన్నారు. అదే సమయంలో నందమూరి బాలకృష్ణ సైతం వారిని పట్టించుకున్న దాఖలాలు లేవు. వారి ప్రస్తావన కూడా తేవడానికి ఆయన ఇష్టపడడం లేదు. విభేదాలు తారాస్థాయికి చేరిపోయాయి అన్నది పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. సరిగ్గా ఇటువంటి సమయంలోనే బాలకృష్ణకు పద్మ అవార్డు లభించింది. బాల బాబాయ్ అంటూ జూనియర్ ఎన్టీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. కళ్యాణ్ రామ్ అయితే తన ఆనందాన్ని వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. తెలుగుదేశం పార్టీని మరో 50 ఏళ్ల పాటు ముందుకు తీసుకెళ్లాలి అన్నది చంద్రబాబు ప్లాన్. తన వయసు రీత్యా ఆయన భవిష్యత్తు ప్రణాళిక వేస్తున్నారు. నారా లోకేష్ ను ప్రమోట్ చేస్తూనే.. నందమూరి కుటుంబాన్ని కొలుపుకేల్లాలని భావిస్తున్నారు. తద్వారా తెలుగుదేశం పార్టీ భవిష్యత్తును తీర్చిదిద్దే పనిలో పడ్డారు చంద్రబాబు. ప్రస్తుతం



సినిమాల్లో బిజీగా ఉన్నారు జూనియర్ ఎన్టీఆర్, కళ్యాణ్ రామ్. వారిని ఇబ్బంది కలిగించకుండా నందమూరి కుటుంబాన్ని ఉపయోగించుకోవాలన్నదే చంద్రబాబు వ్యూహంగా తెలుస్తోంది. తెలంగాణలో టిడిపిని బలోపేతం చేయాలని చంద్రబాబు భావిస్తున్నారు. 2023 ఎన్నికలకు ముందు తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడిగా కాసాని జ్ఞానేశ్వర్ ఉండేవారు. అయితే ఆ ఎన్నికల్లో టిడిపి పోటీ చేయకపోవడాన్ని నిరసిస్తూ ఆయన పార్టీ నుంచి బయటికి వెళ్లిపోయారు. అప్పటినుంచి తెలంగాణ తెలుగుదేశం అధ్యక్షుడు పదవి ఖాళీగా ఉంది. ఆ పదవిని నందమూరి కుటుంబానికి ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. నందమూరి హరికృష్ణ కుమార్తె సుహాసిని కి బాధ్యతలు అప్పగించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఆమె 2018 ఎన్నికల్లో టిడిపి తరఫున కూకట్పల్లి నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. పార్టీలో చాలా యాక్టివ్ గా ఉంటూ వచ్చారు. అందుకే ఆమెకు బాధ్యతలు అప్పగించడం ద్వారా నందమూరి కుటుంబాన్ని కలుపుతున్నట్లు సంకేతాలు ఇవ్వనున్నారట చంద్రబాబు. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# పాపన్న జీవితం ఆదర్శప్రాయం

**జిల్లా రెవెన్యూ అధికారిణి సంగీత**



**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా(ఏప్రిల్ 02):** సర్దార్ సర్వాయి పాపన్న 315వ వర్ధంతి సందర్భంగా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని బి.సి.సంక్షేమ శాఖ కార్యాలయంలో బి. సి. సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారిణి సంగీత ముఖ్య అతిధిగా పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి సర్దార్ సర్వాయి పాపన్న చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్ళు ఆర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న తెలంగాణ వీరుడని కొనియాడారు. సొంత సైన్యాన్ని సమకూర్చుకుని మొఘలాయిలను ఎదురించిన మొట్టమొదటి తెలంగాణ రాజు సర్దార్ సర్వాయి పాపన్న అని, ఆ తర్వాత 33 రాజ్యాలను స్థాపించాడన్నారు. జీవించినన్ని రోజులూ రాజుగానే జీవించాడన్నారు. అలాంటి అద్భుత వ్యక్తి మన తెలంగాణ ప్రజలందరికీ ఆదర్శ ప్రాయుడని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి బి. కేశురాం, కలెక్టరేట్ ఏఓ సునీల్, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారులు పి. రమేష్, వై. మాధవ రెడ్డి, కుల సంఘం నేతలు బోయపల్లి సుధాకర్ గౌడ్, నర్సింహ గౌడ్, బండి రాజు గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# 51మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతులు

**పదోన్నతి ద్వారా మరింత బాధ్యత పెరుగుతుంది**

**పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా**

**జర్నలిస్టు డైరీ, మంచిర్యాల బ్యూరో(ఏప్రిల్ 02):** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధి లో 51మంది కానిస్టేబుళ్లకు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా రామగుండం పోలీస్ కమీషనర్ అంబర్ కిశోర్ ఝా వారికి పదోన్నతి చిహ్నాన్ని అలంకరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సీపీ మాట్లాడుతూ.....పదోన్నతుల తోనే పోలీసులకు గుర్తింపు, ఉత్సాహం వస్తుందని ఎలాంటి రిమార్క్ లేకుండా మిగిలిన సర్వీసును పూర్తి చేసి విధుల్లో మంచి పనితీరు కనబరిచి మరిన్ని పదోన్నతులు పొందాలని అన్నారు. పోలీసు శాఖలో పదోన్నతి ద్వారా స్థాయితో పాటు బాధ్యత పెరుగుతుందని, పెరిగిన బాధ్యతను క్రమశిక్షణాయుతంగా



నిర్వహిస్తూ ప్రజలలో పోలీస్ శాఖ పట్ల నమ్మకాన్ని, గౌరవాన్ని పెంచే విధంగా ఉండాలని సీపీ అన్నారు. ఒక్కరు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని, ఆరోగ్యంగా ఉన్నప్పుడే కుటుంబ సభ్యులతో ఆనందంగా ఉంటాం, మానసికంగా శారీరకంగా ఒత్తిడిని దూరం చేయడానికి ప్రతి ఒక్కరూ శ్రమించాలని, మనం ఆరోగ్యంగా ఉంటే ఏదైనా సాధించవచ్చు అని ఈ సందర్భంగా సీపీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డిసిపి అడ్మిన్ సి రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, ఎఓ శ్రీనివాస్ , ఆర్ ఐ శ్రీనివాస్, సూపరింటెంట్ లు సందీప్ ,మనోజ్ కుమార్ ,సిసి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# సీసీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా ఎన్ ప్రవీణ

**సహాయ కార్యదర్శిగా డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు**





**జర్నలిస్ట్ డైరీ, రంగారెడ్డి జిల్లా బ్యూరో(ఏప్రిల్ 02):** కన్జ్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా శ్రీమతి ఎన్ ప్రవీణ, సహాయ కార్యదర్శిగా సామాజికవేత్త డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ అధ్యక్షులు ప్రీతి ప్రమోద్ రాయ్ పాండ్యా నుండి నియామక పత్రం జారీ చేయగా జాతీయ కార్యదర్శి సతీష్ బాబు, జాతీయ కార్యవర్గ సభ్యురాలు హరిప్రియ,తెలంగాణ అధ్యక్షులు మామిడి భీమ్ రెడ్డి ద్వారా నియామక పత్రాలు ప్రవీణ, వెంకన్నబాబు అందుకున్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ న్యాయమూర్తులు చంద్రయ్య, నారాయణ, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ ప్రొఫెసర్ శ్రీరాములు, రాష్ట్ర ఎంసీ నెంబర్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ ఏవి రావు, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ సుప్రజ, సిసిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ హైదరాబాద్ జిల్లా మేనేజింగ్ కమిటీ మెంబర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా మాపై ఎంతో నమ్మకం ఉంచిరాష్ట్ర కార్యదర్శిగా సహాయ కార్యదర్శిగా నియమించడానికి కృషిచేసిన రాష్ట్ర అధ్యక్షులు మామిడి భీమిరెడ్డికి జాతీయ కార్యవర్గ సభ్యురాలు హరిప్రియ లకు ప్రవీణ, డాక్టర్ కొమ్ము వెంకన్న బాబు కృతజ్ఞతలు తెలియజేశారు.

జర్నలిస్ట్ డైరీ తెలుగు దినపత్రిక

# ఫిల్టర్ ఇసుక అక్రమదందా

**పక్కా సమాచారం ఉన్నా పట్టించుకోని అధికారులు**

**గత పదిరోజులుగా మీనమేషాలు లెక్కిస్తున్న వైనం**




**జర్నలిస్ట్ డైరీ, పరిగి (ఏప్రిల్ 2 ):** అక్రమంగా మట్టి, ఇసుక తరలిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోమని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ వికారాబాద్ జిల్లాలో మాత్రం యథేచ్ఛగా సాగుతున్నాయి. అక్రమ ఫిల్టర్ ఇసుక వ్యాపారం కొనసాగుతున్నప్పటికీ కొంతమంది అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గ దోమ మండల పరిధిలో గత కొద్ది నెలలుగా అక్రమంగా ఫిల్టర్ ఇసుక దోపిడీ కొనసాగుతోంది. అనుమతి లేకుండా ఫిల్టర్ చేస్తున్న ఇసుక సమాచారాన్ని, ఫిల్టర్ ఇసుక డంప్ చేసిన ప్రాంతాన్ని వీడియో ఫోటోలు ద్వారా మే 22న సంబంధిత శాఖ అధికారులకు, మండల తహసిల్దార్‌కి తగిన ఆధారాలతో సమాచారం ఇచ్చారు. దీనిపై స్పందించిన మండల తహసిల్దార్ విచారణ నిమిత్తం దోమ మండలం ఉసేన్ నాయక్ తండాలో అక్రమంగా ఫిల్టర్ ఇసుక నిల్వ ఉంచిన స్థలానికి RI ని పంపించారు. ఆర్ఐ విచారణ పూర్తి చేసి తగిన రిపోర్టుని తహసిల్దార్ కి అందజేశారు. అయితే విచారణ పూర్తయి నేటికీ పది రోజులు గడుస్తున్నా అక్రమ ఫిల్టర్ ఇసుక వ్యాపారులపై ఇంతవరకు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు.

# మద్యంపై నిషేధాజ్ఞలు కొనసాగింపు

**అనుమతి లేని డ్రోన్,డీజే సౌండ్స్‌పై చర్యలు**

**రామగుండం కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్ యాక్ట్**

**పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**




**జర్నలిస్టు డైరీ, మంచిర్యాల బ్యూరో(ఏప్రిల్ 02):** బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం పై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నామని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించి మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు అందుతున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నామని తెలిపారు. మద్యం సేవించి వీధుల్లో రోడ్లపైన అసభ్య పదజాలంతో మాట్లాడటం, అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందిగా పరిణమించిందని, మద్యం బాబుల ఆగడాలకు కళ్లెం వేయడంలో పాటు ప్రజల భద్రత రక్షణ కోసం నిషేధాజ్ఞలు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు 01042025 నుండి 0105 2025 వరకు కొనసాగుతాయని తెలిపారు. పరిస్థితుల ప్రభావం దృష్ట్యా ఈ కాలం పరిమితి పొడిగించబడే అవకాశం ఉందని అన్నారు. (భారతీయ న్యాయ సంహిత) BNS 223, హైదరాబాద్ నగర పోలీసు చట్టం, 1348 ఫసలీ నిబంధనలను అనుసరించి నిషేధాజ్ఞలు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

**డీజే ,డ్రోన్ లపై నిషేధాజ్ఞలు పొడగింపు**

చిన్నపిల్లలు, వృద్ధులు, రోగులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలగకుండా, శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు భారీ సౌండ్‌లతో కూడిన డీజే సౌండ్ వినియోగంపై నిషేధాజ్ఞలు విధించారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ, ప్రదర్శనల కోసం డీజే సౌండ్ల వినియోగిస్తున్నారని, అయితే వివిధ కార్యక్రమాల నిర్వహణకు మైక్ సెట్ వినియోగం తప్పనిసరి అని అనిపిస్తే సంబంధిత డివిజన్ ఏసీపీ అనుమతి పొందాలని సూచించారు. ఏయే ప్రాంతాల్లో ఏ మేరకు ఏ స్థాయిలో మైక్ సెట్ లో వినియోగించాలో నిబంధనలు ఉన్నాయని పేర్కొన్నారు. ఈ నిషేధాజ్ఞలు కొనసాగుతాయని తెలిపారు.

**సిటీ పోలీస్ యాక్ట్ అమలు**

రామగుండం పోలీస్ కమిషనరేట్ పెద్దపల్లి, మంచిర్యాల జోన్ ల పరిధిలో రామగుండం పోలీస్ కమిషనరేట్ 7 (1), 2016, యాక్ట్, 22 (1) (a )నుండి (f ) 22 (2) (a) & ( b), & 22 (3) సిటీ పోలీస్ యాక్ట్, 1348 No IX ఫాస్లి సెక్షన్ 30 పోలీస్ యాక్టు 1861 ప్రకారం రామగుండం కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదు. పైన పేర్కొన్న కార్యక్రమాల నిర్వహణకు ముందుగా పోలీస్ అధికారుల అనుమతి తీసుకోవాలి, బంద్ ల పేరిట వివిధ కారణాలను చూపుతూ బలవంతంగా వివిధ సంస్థలు, కార్యాలయాలను మూసి వేయాలని ఒత్తిడి, బెదిరింపులకు గురిచేసే వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని, శాంతిభద్రతల పరిరక్షణ నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని పోలీస్ కమిషనర్ సూచించారు.



# మిర్యాలగూడలో పోలీసుల స్పెషల్ డ్రైవ్

**జర్నలిస్ట్ డైరీ, మిర్యాలగూడ (ఏప్రిల్ 2):** మిర్యాలగూడలో పోలీసులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ఎన్ఫోర్స్మెంట్ వర్క్ లో భాగంగా ఐసోలేటెడ్ ప్రదేశాలలో తనిఖీలు జరిపారు. ప్రధాన రహదారుల లో వెహికిల్ చెకింగ్, గంజా టెస్టింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్లపై పరీక్షలు నిర్వహించారు. సరైన పత్రాలు లేని 21వాహనాలను సీజ్ చేసారు. ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవంటూ హెచ్చరించారు.




# పట్టాలు తప్పిన నాగావళి ఎక్స్‌ప్రెస్..

**జర్నలిస్ట్ డైరీ, విజయనగరం (ఏప్రిల్2):** విజయనగరం రైల్వే స్టేషన్ సమీపంలోని వెంకటలక్ష్మి థియేటర్ జంక్షన్ వద్ద 'నాగావళి ఎక్స్ ప్రెస్' పట్టాలు తప్పింది. వెంటనే అప్రమత్తమైన అధికారులు రెండు బోగీలు తప్పించి మిగతా ట్రైన్ ను పంపించే ఏర్పాటు చేశారు. దీంతో ఘోర రైలు ప్రమాదం తప్పిందని అంతా ఊపిరిపీల్చుకున్నారు.



# సెంట్రల్ వర్సిటీ భూముల జోలికి వెళ్లొద్దు.!

**ప్రజాపంథా మాస్ లైన్ నేత బందేల వెంకయ్య**

**జర్నలిస్ట్ డైరీ, పాలేరు (ఏప్రిల్ 02):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్నారని ప్రజాపంథా మాస్ లైన్ పాలేరు డివిజన్ కార్యదర్శి బందేల వెంకయ్య అన్నారు. మండల పరిధిలోని పిండిప్రోలు రాయల వెంకట నారాయణ భవనంలో జరిగిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములను కాపాడాల్సిన ప్రభుత్వాలే నేరుగా ప్రభుత్వ భూములను అమ్మడం విడ్డూరంగా ఉందని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి సంబంధించిన 400 ఎకరాల భూమిని అమ్మేందుకు కుట్ర జరుగుతోందని వెంటనే ఆ నిర్ణయాన్ని మార్చుకోవాలని ప్రభుత్వ భూములను కాపాడాలని ఆయన అన్నారు. భూములు అమ్మేస్తే పాలక ప్రభుత్వాలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలంటే వేల కోట్లు పెట్టి ప్రైవేటు వ్యక్తుల దగ్గర భూములు కొనే పరిస్థితి నెలకొంటుందని ఆయన హెచ్చరించారు. ఎన్‌కౌంటర్లలో మృతి చెందిన మావోయిస్టులకు శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో మాస్ లైన్ జిల్లా నాయకులు మల్లీది నాగేశ్వరరావు, తిమ్మిడి హనుమంతరావు, మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, ఖమ్మం రూరల్ మండల కార్యదర్శి మారుతి మల్లయ్య, డివిజన్ నాయకులు కుర్ర వెంకన్న, రెంటాల యాదగిరి, పులు గుజ్జు వెంకటస్వామి,ఆరేపపల వెంకన్న,భానోత్ శంకర్, అప్పారావు. పగిడి కత్తుల రామదాసు, చిర్రా బిక్షం, పోతులూరి, షేక్ ఇమామ్,సైదా,షేక్ నాగుల్ మీరా, తదితరులు ఉన్నారు.

# విప్లవ వీరుడా... అందుకో నివాళి

**తరతరాలకు తరగని స్ఫూర్తి ప్రదాత**

**సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్**

**యువజన సంఘం అధ్యక్షులు ఎడ్ల శ్రీకాంత్ గౌడ్**



**జర్నలిస్ట్ డైరీ, షాద్ నగర్ (ఏప్రిల్2):** ఢిల్లీ పీఠాన్ని గడగడలాడించిన తొలి తెలుగు తేజం. గోల్కొండ కోటపై మొగలాయిల పెత్తనాన్ని ధిక్కరించిన ధీశాలి. ఔరంగజేబుకే ముచ్చమటలు పట్టించిన పోరాట యోధుడు. పేదల పాలిట ఆపద్బాంధవుడు... సమసమాజ స్థాపన సాధనకు ప్రాణాలను పణంగా పెట్టిన వీరుడు. రాజరికంలో వికసించిన సామ్యవాద గొంతుక సర్దార్ సర్వాయి పాపన్న. నేడు ఆయన 315వ వర్ధంతి సందర్భంగా ఆ మహావీరుడి యాదిలో.. షాద్నగర్ లో చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో ఎడ్ల శ్రీకాంత్ గౌడ్, కనం ప్రేమ్ కుమార్ గౌడ్, పీర్లగూడెం అభిలాష్ గౌడ్, బంటారం మహేష్ గౌడ్, కంది రఘు గౌడ్, పోలేపల్లి సందీప్ గౌడ్,మొగిలిగిద్ద కార్తీక్ గౌడ్,పోలేపల్లి ప్రవీణ్ గౌడ్, అనిమి రఘు గౌడ్,పెండ్లి మడుగు వంశీ గౌడ్, గౌతపురం శ్రీకాంత్ గౌడ్, పెంటమిది శివశంకర్ గౌడ్,బాదేపల్లి గోపాల్ గౌడ్, ఎదిరే ఉదయ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



# రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

జర్నలిస్ట్ డైరీ, పెద్దపల్లి (ఏప్రిల్ 2): రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో ఉండాలని పెద్దపల్లి డీసీపీ కరుణాకర్ అన్నారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా పెద్దపల్లి సర్కిల్ పరిధిలోని పలువురు రౌడీషీటర్ లకు కౌన్సెలింగ్ చేశారు. చట్ట పరిధిలో నడుచుకోవాలని, ఇతరులకు భంగం కలిగించే విధంగా ప్రవర్తించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డిసిపి తెలిపారు. క్రిమినల్ కేసుల్లో రౌడీషీటర్ లు తల దూర్చితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశం లో పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, పెద్దపల్లి సీఐ ప్రవీణ్ కుమార్, ఎస్ఐలు లక్ష్మణ్ రావు, మల్లేశం, లక్ష్మణ్, స్వామిలు, పోలీసులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ నాయకుడికి నివాళులు అర్పించిన పెద్ది సుదర్శన్ రెడ్డి

**జర్నలిస్ట్ డైరీ, నర్సంపేట (ఏప్రిల్ 2):** బీఆర్ఎస్ పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు మాజీ కౌన్సిలర్ వెల్పుగొండ పద్మ భర్త వెల్పుగొండ రాజు అనారోగ్యంతో మరణించగా అతని పార్థివ దేహానికి మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చిన పెద్ది పార్టీ ఎల్లప్పుడు కుటుంబానికి అండగా ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిడి రవీందర్ రెడ్డి, పట్టణ పార్టీ అధ్యక్షులు నాగెల్లి వెంకట్ నారాయణ, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్, మునిగాలా వెంకట్ రెడ్డి క్లస్టర్ బాధ్యులు, మాజీ కౌన్సిలర్లు, యూత్ అధ్యక్షులు, ఎస్సీ సెల్ అధ్యక్షులు,పట్టణ పార్టీ బాధ్యులు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# పాపన్న గౌడ్‌కు ఘన నివాళి

**జర్నలిస్ట్ డైరీ, ఖమ్మం(ఏప్రిల్ 02):** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ వర్ధంతి సందర్భంగా లకారం ట్యాంక్ బండ్‌పై ఉన్న ఆయన విగ్రహానికి బీసీ నేతలు ఘనంగా నివాళులు అర్పించారు. గౌడ సంఘం రాష్ట్ర నాయకులు అమరగాని వెంకన్న గౌడ్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం నగర అధ్యక్షులు గద్దె వెంకట్రామయ్య శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వరాజ్య స్థాపన కోసం బహుజనుల ఆత్మగౌరవం కోసం పోరాడిన గొప్ప వీరుడు చక్రవర్తి పాపన్న గౌడ్ అని కొనియాడారు. ఆయన ఆశయాలు సాధించడం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం, బీసీ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రకృతి విపత్తులను ఎదుర్కోవటంటపై

# వాలంటీర్లకు శిక్షణ

**జర్నలిస్ట్ డైరీ, పాలేరు(ఏప్రిల్ 02):** తిరుమలాయపాలెం మండలంలో గత సంవత్సరం సెప్టెంబర్ మొదటి వారంలో వచ్చిన ఆకేరు వరదకు రాకాసి తండా సర్వం కోల్పోయిన విషయం తెలిసిందే. ఇలాంటి పకృతి విపత్తులు వచ్చినప్పుడు ప్రజలను వరద ముప్పు నుంచి తప్పించడంపై వాలంటీర్లకు బుధవారం శిక్షణ ఇచ్చారు. రాకాసి తండా గ్రామాన్ని ఎంపీడీవో సిలార్ సాహెబ్ ఆధ్వర్యంలో సందర్శించారు. ఆకేరు వరద ఎంత నష్టాన్ని మిగిలించిందో ప్రత్యక్షంగా వాలంటీర్లు పరిశీలించారు. జిల్లాస్థాయిలో వాలంటీర్లకు ప్రకృతి విపత్తును ఎలా ఎదుర్కోవాలో శిక్షణ నిర్వహిస్తుండగా తిరుమలాయపాలెం మండలం రాకాసి తండా గ్రామాన్ని సందర్శించి ఒక్కరోజు శిక్షణ పొందారు. జిల్లా కలెక్టర్ ముజామిల్ ఖాన్ సూచనల మేరకు ఈ శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ నవాజ్ పాషా ,మురహరి,మండల తహశీల్దార్ సుధీర్, ఆర్ ఐ వీరయ్య, ఏఈఈ పంచాయతీరాజ్ ప్రఫుల్ కుమార్ ఆర్డబ్ల్యూఎస్ ఏఈఓ,నవనీత, సర్వేయర్ అప్పారావు, మండల ఈజీఎస్ సిబ్బంది, గ్రామ పంచాయతీ కార్యదర్శి అబ్దుల్ రహీమ్, జల్లేపల్లి పంచాయతీ కార్యదర్శి రమేష్ ఫీల్డ్ అసిస్టెంట్లు,ఆశ వర్కర్లు మరియు గ్రామ దీపికలు తదితరులు పాల్గొన్నారు.





# తిరుమలాయపాలెం నూతన తహశీల్దార్ గా జి.సుధీర్



**జర్నలిస్ట్ డైరీ, పాలేరు(ఏప్రిల్ 02):** తిరుమలాయపాలెం మండల నూతన తహశీల్దార్‌గా జి.సుధీర్(ఇంచార్జ్) బుధవారం కార్యాలయంలో పదవి బాధ్యతలు స్వీకరించారు.పీవీ రామకృష్ణ గత నెలలో పదవి విరమణ చెందడంతో ఆయన స్థానంలో మహబూబాబాద్ జిల్లా నుండి సుధీర్ ఇక్కడికి వచ్చారు.దీంతో తహశీల్దార్ కార్యాలయం ఉద్యోగులు,సిబ్బంది ఆయనకు పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.కాగా గతంలో పని చేసిన తహశీల్దార్ పీవీ రామకృష్ణ ఉత్తమ అధికారిగా ప్రజల మన్ననలు పొందారు.గతేడాది వచ్చిన వరద విపత్తు సమయంలో ప్రభుత్వ ఆదేశాల ప్రకారం తోటి మండల అధికారులను సమన్వయం చేసుకుంటూ రేయింబవళ్ళు శ్రమించి రాకాసితండా ప్రజలను కాపాడారు.అంతే కాకుండా సర్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం నుండి వచ్చే నష్టపరిహారం వచ్చేలా కృషి చేశారు. అదే విధంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ చేతుల మీదుగా ఉత్తమ తహశీల్దార్ గా ప్రశంసా పత్రాలు సైతం అందుకున్నారు.

# ఛలో హెచ్ సీయూ.. పలువురు అరెస్టు

**జర్నలిస్ట్ డైరీ, ఖమ్మం, (ఏప్రిల్ 2):** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ 400 వందల ఎకరాల భూముల వేలంపాటను ఆపాలి వెంటనే బుల్డోజర్లను, జేసీబీ లను వెనక్కు తీసుకోవాలనీ డిమాండ్ చేస్తూ... చలో హెచ్సీయూ హైదరాబాద్ వెళ్తున ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, సీపీఎం నాయకులను పోలీసులు అరెస్టు చేసారు. రఘునాధపాలెం మండలం చిమ్మపూడి గ్రామంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు.

# కాలువలో మహిళ మృతదేహం

జర్నలిస్ట్ డైరీ, వికారాబాద్ (ఏప్రిల్ 2): పెద్దేముల్ మండల కేంద్రంలో పెద్ద కానల్ వద్ద గుర్తుతెలియని మహిళ మృతదేహం లభించింది. మహిళ ఒంటిపై ముఖంపై కాల్చిన గాయాలు. వున్నాయి. దుండగులు హత్య చేసి నీటి కాలువలో పడేసినట్టుగా స్థానికుల అనుమానిస్తున్నారు. ఘటనా స్థలానికి చేరుకున్న పెద్దమూల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.

# ఉప్పల్ స్టేడియంను ముట్టడించిన యూత్ కాంగ్రెస్ నాయకులు

**జర్నలిస్ట్ డైరీ, హైదరాబాద్, (ఏప్రిల్ 2):** హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ వైఖరిని నిరసిస్తూ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు అరుణ్ ఆధ్వర్యంలో ఉప్పల్ క్రికెట్ స్టేడియంను యూత్ కాంగ్రెస్ నాయకులు ముట్టడించారు. హెచ్ సీఏ అధ్యక్షుడు జగన్మోహన్ రావును వెంటనే సస్పెండ్ చేయాలని నినాదాలు చేశారు. పోలీసులు కలగజేసుకోనికి వారికి నచ్చ చెప్పే ప్రయత్నం చేశారు.






# మంచిర్యాల జిల్లా అధ్యక్షులుగా బింగి సదానందం

**జర్నలిస్ట్ డైరీ, మంచిర్యాల బ్యూరో(ఏప్రిల్ 02):** నస్పూర్ మండలంలోని శ్రీరాంపూర్ RK ఏరియా ఎయిమ్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ లో జరిగిన తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల సంక్షేమ సంఘం యువజన విభాగం జిల్లా ముఖ్య నాయకుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి బింగి సదానందం అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె నర్సింగ్ హాజరై ప్రసంగించారు. అనంతరం బింగి సదానందం మాట్లాడుతూ... తన మీద నమ్మకంతో జిల్లా అధ్యక్ష బాధ్యతలు అప్పజెప్పిన రాష్ట్ర అధ్యక్షులు ఎం. కమలాకర్‌కు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జె. నర్సింగ్, జిల్లా అధ్యక్షులు టి రాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు. యువజన విభాగాన్ని జిల్లా వ్యాప్తంగా బలోపేతం చేస్తూ నియోజకవర్గ, మండల, మున్సిపాలిటీల కమిటీలను నిర్మిస్తానని తెలియజేశారు.

# కూటమికి రెండు కళ్ళు..

## అమరావతి, విశాఖను సమానంగా చూస్తున్న ప్రభుత్వం..

## రెండు చోట్ల అభివృద్ధి సమానం..



**జర్నలిస్ట్ డైరీ, విజయవాడ, (ఏప్రిల్ 2):** కూటమి సర్కార్ అమరావతితో పాటు విశాఖ అభివృద్ధిపై కూడా ఫోకస్ పెట్టిందా..?విశాఖను ఆర్థిక రాజధానిగా మలిచేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తుందా..? అమరావతి, విశాఖను కూటమి సర్కార్ రెండు కళ్లుగా భావిస్తుందా.? ఈ రెండు నగరాల అభివృద్ధిని బ్యాలెన్సింగ్ చేసేందుకు కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుందా..? అమరావతి, వైజాగ్ డెవలప్‌మెంట్ కోసం ప్రభుత్వం ఏం చేయబోతోంది.? ఏపీకి అద్భుతమైన రాజధానిని నిర్మించడమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల మంత్రం జపించినా కూటమికే జై కట్టారు ప్రజలు. వైసీపీ గెలిస్తే.. విశాఖ రాజధాని అవుతుందని తెలిసినా.. ఆ ప్రాంత ప్రజలు కూటమికే పట్టం కట్టారు. ఐతే విశాఖ ప్రజలు ఎక్కడ నిరుత్సాహ పడిపోకుండా కూటమి సర్కార్ పక్కా ప్రణాళికతో అడుగులు వేస్తుందట.కూటమి సర్కార్ పవర్‌లోకి వచ్చిన డే వన్ నుంచి అమరావతి నిర్మాణపనుల విషయంలో యాక్షన్ ప్లాన్‌ని రెడీ చేసుకొని ముందుకు వెళ్తోంది. అదే సమయంలో రాయలసీమ ఉత్తరాంధ్రాకు కూడా సమన్యాయం చేసేలా ప్రణాళికలను రూపొందించిందట కూటమి సర్కార్. అమరావతితో పాటు విశాఖకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తోంది. విశాఖను ఐటీ హబ్‌గానూ పారిశ్రామిక కేంద్రంగానూ తీర్చిదిద్దడానికి ఉన్న అన్ని అవకాశాల్ని వాడుకుంటోంది. అలా విశాఖపట్నం వాసుల కలలను నెరవేర్చే పనిలో సక్సెస్ అవుతోందని లోకల్ టాక్.విశాఖ పర్యటనకు వచ్చిన మంత్రి నారా లోకేశ్.. ఈ ప్రాంతాన్ని ఐటీ హబ్‌గా మార్చుతామని ప్రకటించారు. విశాఖలో రానున్న ఐదేళ్లలో ఏకంగా 5 లక్షల ఐటీ ఉద్యోగాలు వచ్చేలా చూస్తున్నామని అన్నారు. అంతర్జాతీయ నగరంగా, ఆర్థిక రాజధానిగా విశాఖను తీర్చిదిద్దుతామన్నారు. విశాఖ ఏపీకే గొప్ప నగరంగా ఉంటుందని ఆయన హామీ ఇచ్చారువిశాఖ గురించి గొప్పగా చెప్పడమే కాకుండా విశాఖకు కూటమి ప్రభుత్వం ఏమి చేసింది ఏమి చేయబోతోంది క్లారిటీ ఇచ్చేశారు లోకేశ్. ఇలా విశాఖ రాజసం కానీ రాజధాని హోదా కానీ ఎక్కడా తగ్గకుండా ప్రభుత్వం ముందుకు వెళ్లేలా కనిపిస్తోందని లోకల్ పీపుల్స్ చర్చించుకుంటున్నారట.మంత్రి లోకేశ్ మొత్తం విశాఖ అభివృద్ధిపై ఫోకస్ పెడితే.. సీఎం చంద్రబాబు అమరావతి గురించి ఎక్కువగా చెబుతుంటారు. ఏ సభకు వెళ్లినా. ఏ కార్యక్రమానికి వెళ్లినా... అమరావతి అద్భుతంగా తీర్చుదిద్దుతామని చంద్రబాబు ప్రస్తావిస్తారు.ఇలా రెండు నగరాలను డెవలప్‌చేసేలా కూటమి సర్కార్ దూసుకెళ్తోందని అన్నివర్గాలు చర్చించుకుంటున్నాయి. ఈ విషయంలో విశాఖ జనాలు కూడా ఫుల్ ఖుషీ అవుతున్నారట. ఏది ఏమైనా అమరావతి, విశాఖ రెండింటినీ కరెక్ట్‌గా బాలెన్స్ చేసుకుంటూ వెళ్తున్నారని బలమైన టాక్ జనాల్లోకి వెళ్లిపోయిందట.



# కొత్త ఉందే భారత్‌కు పచ్చ జెండా ఒపనున్న మోదీ

## 38 సొరంగాల గర్భంలో.. 927 వంతెనలు దాటుకుంటూ..

## జమ్ము కశ్మీర్ రాష్ట్రంలో మరో అద్భుతం..

**జర్నలిస్ట్ డైరీ, శ్రీనగర్, (ఏప్రిల్ 2):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏప్రిల్ 19న కాత్రా నుండి కాశ్మీర్‌కు మొదటి వందే భారత్ రైలును జెండా ఊపి ప్రారంభించనున్నారు. దీనితో 272 కి.మీ. పొడవైన ఉధంపూర్‌శ్రీనగర్‌బారాముల్లా రైలు లింక్ ప్రాజెక్ట్ పూర్తవుతుంది. జమ్మూ రైల్వే స్టేషన్‌లో మరమ్మత్తు, పునరుద్ధరణ పనులు జరుగుతున్నందున జమ్మూకాత్రాశ్రీనగర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ మొదట కాత్రా నుండి నడుస్తుంది. రైలు లింక్ ప్రాజెక్ట్ గత నెలలో పూర్తయిందని అధికారులు తెలిపారు. జనవరిలో కాత్రా కాశ్మీర్ మధ్య రైలు సేవను రైల్వే భద్రతా కమిషనర్ ఆమోదించారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ జమ్మూ అండ్ శ్రీనగర్ మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గిస్తుందని, ఈ ప్రాంతానికి ఆధునిక, సమర్థవంతమైన రైలు సేవలను అందిస్తుందని అధికారులు చెబుతున్నారు.దీని గురించి కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఆదివారం మీడియాతో మాట్లాడుతూ.. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఏప్రిల్ 19న ఉధంపూర్ చేరుకుంటారు. ప్రపంచంలోనే ఎత్తైన రైల్వే వంతెనను ఆయన సందర్శించి ప్రారంభిస్తారు. దీని తర్వాత ఆయన కాట్రా నుండి వందే భారత్ రైలును జెండా ఊపి ప్రారంభిస్తారని అన్నారు. దీనితో కాశ్మీర్‌కు ప్రత్యక్ష రైలు కనెక్టివిటీ కోసం చాలా కాలంగా ఉన్న డిమాండ్ నెరవేరుతుంది. ప్రస్తుతం లోయలోని సంగల్దాన్, బారాముల్లా మధ్య, అలాగే కాట్రా నుండి దేశవ్యాప్తంగా ఉన్న గమ్యస్థానాలకు మాత్రమే రైలు సేవలు నడుస్తున్నాయని తెలిపారు. కాశ్మీర్‌ను రైలు ద్వారా అనుసంధానించే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు 1997లో ప్రారంభమైందని అధికారులు తెలిపారు. కానీ భౌగోళిక, భౌగోళిక, వాతావరణ సంబంధిత సవాళ్ల కారణంగా దీని పూర్తి ఆలస్యం అయింది. ఈ ప్రాజెక్టులో మొత్తం 119 కి.మీల పొడువునా 38 సొరంగాలు ఉండగా, వీటిలో 12.75 కి.మీల మేర నిర్మించిన టీ49 సొరంగం అత్యంత పొడవైనది. అలాగే, ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో 927 వంతెనలు సైతం ఉన్నాయి. వీటిలో చీనాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెన కూడా ఉంది. దీని ఎత్తు 359 మీటర్లు కాగా, పారిస్‌లోని ప్రఖ్యాత ఐఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 35 మీటర్లు ఎక్కువ.

# గిబ్లీతో బతుకు బస్టాండే..

## వ్యతిరేఖ మార్గంలో వినియోగిస్తే అంతే సంగతి..

## టెక్నాలజీతో జర పైలం..

**జర్నలిస్ట్ డైరీ, డెస్క్ (ఏప్రిల్2):** టెక్నాలజీ రోజు రోజుకీ కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రతి రోజూ ఏదో ఒక అప్ డేట్ రావడం.. అది ట్రెండింగ్లోకి వచ్చేయడం మనం చూస్తూనే ఉన్నాం. ఇటీవల కాలంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) చేస్తున్న అద్భుతాలు మనం చూస్తూనే ఉన్నాం. ఓపెన్ఆధ్వర్యంలోని చాట్ జీపీటీతో పాటు అనేక రకాల చాట్ బాట్ లు అందుబాటులోకి వచ్చాయి. వీటి ద్వారా అందిప్రయోజనాలతో పాటు ఇబ్బందికర పరిస్థితులు కూడా మనిషికి వస్తున్నాయి. ఇప్పుడు మరో కొత్త అప్ డేట్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. చాట్ జీపీటీ4ఓ సౌజన్యంతో వచ్చిన ఘిబ్లీ స్టైల్ పోర్ట్రెయిట్‌లు సన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. ఫేస్ బుక్, ఇన్ స్టాగ్రామ్, ఎక్స్ ఇలా ఏ సోషల్ మీడియా ప్లాట్ ఫారం చూసిన ఈ ఘిబ్లీ స్టైల్ పోర్ట్రెయిట్‌లే దర్శనమిస్తున్నాయి. ఈ ఏఐ జనరేటెడ్ అవతార్‌ను ప్రజలు విస్తృతంగా షేర్ చేస్తున్నాయి. ఈ ట్రెండ్ కేవలం వ్యక్తిగత చిత్రాలకే పరిమితం కాలేదు.. వైరల్ ట్రెండ్‌లో భాగం కావడానికి వినియోగదారులు పిల్లలతో సహా కుటుంబ చిత్రాలను కూడా అప్‌లోడ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఇదే అనేక ప్రశ్నలకు తావిస్తోంది. ఏఐ కంపెనీలకు పంపుతున్న మన చిత్రాలు ఎంత వరకూ భద్రం అని? భవిష్యత్తులో వాటి వల్ల ఏమైనా ఇబ్బందులు తలెత్తుతాయా అన్నా ప్రశ్న అందరిలోనూ మొదలైంది. ఈ నేపథ్యంలో ఈ ఘిబ్లీ గురించిన పూర్తి వివరాలు ఇప్పుడు చూద్దాం..



**మీ ముఖమే కరెన్సీ!**

ఏఐ జనరేట్ చేస్తున్న ఘిబ్లీ చిత్రాలు వినోదాత్మకంగా ఉంటున్నాయి. వాటిని చూస్తున్న వినియోగదారులు ఎంతో ఉత్సాహంగా సోషల్ మీడియా ప్లాట్ ఫారంలలో షేర్ చేస్తున్నారు. కుటుంబ సభ్యులు అందరూ ఉన్న చిత్రాలను సైతం ఏఐకి అందించి, ఘిబ్లీ స్టైల్ చిత్రాలను తీసుకుంటున్నారు. ప్రతిరోజూ లక్షలాది మంది తమ ముఖ డేటాను ఏఐ కంపెనీలకు ఇష్టపూర్వకంగా సమర్పిస్తున్నారు. దాంతో పాటు ఆ ఏఐ టూల్ ఉండే యాప్ లకు కెమెరా అనుమతులు, గ్యాలరీ అనుమతులను వినియోగదారులు ఇవ్వాల్సి వస్తోంది. సరిగ్గా ఇక్కడే సెక్యూరిటీ ప్రశ్నార్థకం అవుతోంది. వాస్తవానికి మనం గమనించాల్సిన అంశం ఏమిటంటే ఏఐ సంస్థలు ఈ చిత్రాలను ప్రాసెస్ చేయవు.. అవి మీ ముఖం కొలతలను స్కాన్ చేస్తాయి. నిల్వ చేస్తాయి. ఆ తర్వాత మ్యాప్ చేస్తాయి. అంటే మీ ముఖ గుర్తింపు శాశ్వతంగా ఉంటుంది. అంటే ఏఐ మీ ముఖాన్ని శాశ్వతంగా స్టోర్ చేసుకుంటుంది. ఇది సర్వసాధారణంగా మారదు కాబట్టి.. తర్వాత దానిని వ్యతిరేఖ మార్గంలో వినియోగిస్తే.. పరిస్థితి ఏమిటి? అన్న ప్రశ్న ఇక్కడ ఉత్పన్నమవుతోంది.

**నీ ముఖం చూసి ఎవరు లాభం పొందుతున్నారు?**

2021లో 5.01 బిలియన్ డాలర్లు ఉన్న ఫేషియల్ రికగ్నిషన్ టెక్నాలజీ (ఎఫ్ఆర్టీ) పరిశ్రమ 2028 నాటికి 12.67 బిలియన్లకు చేరుకుంటుందని అంచనా. మెటా, గూగుల్ వంటి ప్రధాన టెక్ దిగ్గజాలు తమ ఏఐ మోడళ్లకు శిక్షణ ఇవ్వడానికి యూజర్ ఇమేజ్‌లను ఉపయోగిస్తున్నాయని చాలా కాలంగా ఆరోపణలు ఎదుర్కొంటున్నాయి. అయినప్పటికీ ఈ దోపిడీ ఎంత లోతుగా సాగుతుందో వారు నోరు విప్పడం లేదు. మరి ఇలాంటి సమయంలో మన ఫేస్ ను భద్రంగా ఉంచుకోవాలంటే ఏం చేయాలి? ఘిబ్లీ స్టైల్ ఇమేజ్ ను చేసుకోవడం మంచిదేనా?



# రైతుల కొంపముంచిన కావేరి సీడ్స్

## కావేరి కంపెనీకి చెందిన 853

## ఆడ మగ మొక్కజొన్న విత్తనాలు ఫెయిల్

**జర్నలిస్ట్ డైరీ, డెస్క్, (ఏప్రిల్2):** కావేరి కంపెనీకి చెందిన 853 రకం ఆడ మగ మొక్కజొన్న విత్తనాలు రైతుల కొంప ముంచాయి. నాణ్యత లేని విత్తనాలను రైతులకు విక్రయించటంతో అన్నదాతలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఖమ్మం జిల్లాలోని వైరా, కొణిజర్ల మండలాల్లో ఈ రకం విత్తనాలను సాగు చేసిన రైతులు వందలాది ఎకరాల్లో పంట నష్టపోయారు. ఆడ మగ విత్తనాలు క్రాసింగ్ కాకపోవటంతో ఒక్కో ఎకరానికి 2 నుంచి 5 క్వింటాళ్ల దిగుబడి కూడా వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో ఏపుగా పెరిగి విత్తనాలు లేని బెండు కంకులను చూసి రైతులు లబోదిబోమంటున్నారు. 853 రకం విత్తనాలను సాగు చేసిన రెండు మండలాల్లోని రైతులు కోట్లాది రూపాయలను నష్టపోయారు. ఆంధ్రకు చెందిన ఆర్గనైజర్ కింద ఉద్యోగులుగా పని చేసిన ఇద్దరు వ్యక్తులు రైతులు ఇంటింటికి తిరిగి మాయ మాటలు చెప్పి ఈ విత్తనాలు సాగు చేయించారు. కంపెనీ అగ్రిమెంట్లపై సంతకాలు చేయించిన ఈ ఇద్దరు వ్యక్తులు రైతులకు అగ్రిమెంట్ బాండ్లను ఇవ్వలేదు. ముందుగా బాండ్లు రైతులకు ఇస్తామని చెప్పి ఇప్పుడు ముఖం చాటేస్తున్నారు.

**సూత్రధారి, పాత్రధారులు వారే....**

ఆంధ్ర ప్రాంతానికి చెందిన ఓ ఆర్గనైజర్ వైరా కొణిజర్ల మండలాల్లో ఇద్దరు వ్యక్తులను ఉద్యోగులుగా నియమించుకొని రైతులతో ఈ విత్తనాలు సాగు చేయించారు. కొణిజర్ల మండలం తీగల బంజర కు చెందిన ఓ వ్యక్తి, లాలాపురం గ్రామానికి చెందిన మరో వ్యక్తి రైతులకు మాయమాటలు చెప్పి విత్తనాలు సాగు చేయించారు. వైరా మండలంలోని పాలడుగు, ఖానాపురం, అష్ణగుర్తి, కొండకుడిమ కొణిజర్ల మండలంలో తీగల బంజార, లాలాపురం, గుబ్బగుర్తి తదితర గ్రామాల్లో వందలాది ఎకరాల్లో ఈ రకం విత్తనాలను రైతులతో సాగు చేయించారు. రైతులకు పెట్టుబడిగా కొంత నగదును అందజేశారు.


రైతుల నుంచి వారు ఇరువురు అగ్రిమెంట్లను తీసుకున్నారు. అయితే రైతులకు బాండ్లు ఇవ్వకుండా రేపు మాపు ఇస్తామంటూ కాలయాపన చేశారు. అయితే ప్రస్తుతం ఆడ మగ క్రాసింగ్ కాకపోవడంతో బెండు కంకులు ఏర్పడ్డాయి. దీంతో తాము నష్టపోయామని గ్రహించిన రైతులు లబోదిబోమంటున్నారు. తమకు మాయమాటలు చెప్పిన వారు ఇరువురు ప్రస్తుతం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కావేరి కంపెనీలో ఎలాంటి అర్హత లేని వీరిరువురు రైతులను తీవ్రంగా మోసం చేశారు. ఈ విషయమై వారిని ఎవరైనా ప్రశ్నిస్తే రైతులు ప్రతి ఫీల్డ్ బాగా సాగు చేశారా అంటూ అన్నదాతలపై నెపం మోపేందుకు ప్రయత్నిస్తున్నారు. బాధిత రైతులు గట్టిగా నిలదీస్తే మీకు చేతనైంది చేసుకోండి అంటూ వీరిలో ఒక వ్యక్తి మాట్లాడుతుండటం విశేషం.

**వ్యవసాయ శాఖ పోలీసులకు ఫిర్యాదు చేస్తాం..**

కావేరి 853 రకం పేరుతో తమకు విత్తనాలను అంటగట్టిన ఇద్దరు వ్యక్తులపై వ్యవసాయ శాఖ అధికారులతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేస్తామని బాధిత రైతులు వాపోతున్నారు. తమ ఇళ్లకు వచ్చి మాయమాటలు చెప్పి ఈ ఇద్దరు దళారులు తమతో విత్తనాలను సాగు చేయించారని బాధిత రైతులు గుత్తా రాంబాబు, రేమల్లె నారాయణతో పాటు పలువురు దిశకు తెలిపారు. తమతో అగ్రిమెంట్ చేయించుకున్న దళారులు నెలలో బాండ్లు ఇస్తామని చెప్పి మోసం చేశారని వాపోయారు. కావేరి కంపెనీ నకిలీ బాగోతం పై న్యాయపోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ విషయమై వైరా మండల వ్యవసాయ అధికారి మంజు ఖాన్‌ను దిశ వివరణ కోరగా ఆడ మగ మొక్కజొన్న సాగు పై రైతులకు అవగాహన కల్పించేందుకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విస్తృత ప్రచారం చేశామన్నారు. రైతులకు బాండ్లు ఇచ్చిన కంపెనీ విత్తనాలే సాగు చేయాలని సూచించామని చెప్పారు. కావేరి కంపెనీ విత్తనాలు సాగు చేసి నష్టపోయిన రైతుల వివరాలు తమ దృష్టికి రాలేదని వివరించారు. వెంటనే రైతులు పంటలను పరిశీలించి బాండ్లు ఇవ్వని వారిపై చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్సు చేస్తామని వివరించారు.

# దేవా రివ్యూ

రీసెంట్ గా ఓటిటిలో రిలీజ్ కి వచ్చిన లేటెస్ట్ చిత్రాల్లో బాలీవుడ్ స్టార్ షాహిద్ కపూర్ హీరోగా పూజా హెగ్డే హీరోయిన్ గా నటించిన పోలీస్ యాక్షన్ డ్రామా చిత్రం 'దేవా' కూడా ఒకటి. నెట్ ఫ్లిక్స్ లో రిలీజ్ కి వచ్చిన ఈ చిత్రం ఎలా ఉందో సమీక్షలో చూద్దాం. ఈ చిత్రం సౌత్ ముంబైలో సెటప్ చేసిన పోలీస్ డ్రామా.. ఒక మాస్ పోలీస్ గా దేవ్ అంబ్రె (షాహిద్) కపూర్ ముంబైలో క్రిమినల్స్ పట్ల చాలా సీరియస్ గా కనిపిస్తాడు. అయితే అదే ముంబైలో మాఫియా గ్యాంగ్స్టర్ ప్రభత్ జాదవ్ (మనీష్ వద్వాహ్) ని పట్టుకునే క్రమంలో ముంబై పోలీస్ అతన్ని విఫలం అవుతూ ఉంటారు. అయితే దేవ్ కి అదే పోలీస్ డిపార్ట్మెంట్ లో మంచి స్నేహితులు ఏసీపీ రోహన్ (పవిల్ గులాటి) అలాగే డీసీపీ ఫర్హాన్ ఖాన్ (ప్రవేష్ రానా) కాగా వీరిలో రోహన్ తో కలిసి ప్రభత్ ని పట్టుకునే ఓ మిషన్ లో అతన్ని ఎన్కౌంటర్ చేసిన క్రెడిట్ ని దేవ్ తన ఫ్రెండ్ రోహన్ కి ఇస్తాడు. కానీ ఈ రోహన్ అనుమానాస్పదంగా ఓ పోలీస్ మీటింగ్ లోనే చంపబడతాడు. మరి అతన్ని చంపింది ఎవరు? ఈ ఇన్వెస్టిగేషన్ లో దెబ్బ తిన్న దేవ్ గతం మర్చిపోయిన తర్వాత ఏమయ్యింది? చివరికి ఆ హంతకుణ్ణి పోలీస్ పెట్టుకున్నారా లేదా? ఇందులో ఎవరెవరికి కనెక్షన్ లు ఉన్నాయి అనేది తెలియాలి అంటే ఈ చిత్రాన్ని చూసి తెలుసుకోవాలి. పోలీస్ బ్యాక్ డ్రాప్ లో అనేక వెర్షన్ లు ఉన్నాయి అయితే మంచి మాస్ కాప్ డ్రామాలని ఇష్టపడేవారికి ఈ దేవా మంచి ట్రీట్ ఇస్తుంది అని చెప్పవచ్చు. ఇది రీమేక్ నే అయినప్పటికీ ఈ విషయం తెలియని ఆడియెన్స్ అయితే డెఫినెట్ గా ఎంజాయ్ చేసే అంశాలు చాలానే ఈ సినిమాలో కనిపిస్తాయి. మెయిన్ గా షాహిద్ పై మాస్ మూమెంట్స్ అయితే మాస్ సినిమా లవర్స్ ని ఎంగేజ్ చేస్తాయి. ఒక బ్యాడ్ ఆస్ కాప్ లా షాహిద్ కపూర్ తన రోల్ లో అదరగొట్టేసాడు అని చెప్పడంలో డౌట్ లేదు. తనపై ఫైట్స్ కానీ తన మస్కులర్ బాడీతో సాలిడ్ గా కనిపించాడు. అలాగే తనపై స్టైలిష్ యాక్షన్ డిజైన్ కూడా సినిమాలో బాగుంది. ఇంకా కొన్ని మాస్ డైలాగ్స్ కూడా తనపై బాగున్నాయి. ఇక వీటితో పాటుగా మర్డర్ ఇన్వెస్టిగేషన్ పై సీన్స్ థ్రిల్లర్ సినిమాలని ఇష్టపడేవారికి నచ్చుతాయి. వీటితో పాటుగా ఈ చిత్రంలో షాహిద్ దేవ్ అయితే సినిమాకి దేవా అనే టైటిల్ ఎందుకు పెట్టారు అనే పాయింట్ సినిమా కథనంలో రివీల్ అయినప్పుడు మంచి ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తుంది. అంతే కాకుండా అనిమల్ ఫేమ్ నటుడు ఉపేంద్ర లిమాయె మరో సాలిడ్ రోల్ ని అందుకున్నారు. తనపై గన్స్ పై సీన్స్ కూడా మంచి ఇంట్రెస్టింగ్ గా అనిపిస్తాయి. ఇక వీరితో పాటుగా షాహిద్ ఫ్రెండ్ పోలీస్ పాత్రల్లో కనిపించిన పవిల్ గులాటి అలాగే ప్రవేష్ రానాలు తమ పాత్రల్లో బాగా సెట్ అయ్యారు. అలాగే కొన్ని ఎమోషన్స్ మరియు సెకండాఫ్ లో ట్విస్ట్ లు కొన్ని బాగున్నాయి. ఈ చిత్రాన్ని ఓటిటిలో ఇదొక రీమేక్ అని తెలియని వారికి బాగానే అనిపిస్తుంది కానీ రీమేక్ అని తెలిసినవారికి అంత గొప్పగా అనిపించకపోవచ్చు. మెయిన్ గా కథనం స్లోగా సాగడం అనేది ఒకింత మైనస్ అని చెప్పాలి. షాహిద్ పై ఆ కొన్ని మాస్ మూమెంట్స్ కూడా లేకపోతే ఈ చిత్రం ఇంకా చప్పగా ఉండేది ఏమో. అలాగే సెకండాఫ్ లో కథనం ఫస్టాఫ్ లో సాగిన రీతిలో మరీ అంత ఎంగేజింగ్ గా అనిపించదు. అలాగే క్లైమాక్స్ కి వచ్చేసరికి కథనం కొంచెం కన్ఫ్యూజ్ గా కూడా ఆడియెన్స్ కి అనిపించి ఉండొచ్చు. అలాగే హీరో రోల్ పై డార్క్ నిజం కూడా అందరినీ మెప్పిస్తుంది అని చెప్పడానికి లేదు. అలాగే పూజా హెగ్డే తన రోల్ లో ఓకే కానీ తాను ఆ పాత్రకి నామ మాత్రం గానే అనిపిస్తుంది. ఆమెకి అంత స్కోప్ కూడా సినిమాలో పెద్దగా ఉన్నట్టు అనిపించదు. వీటితో ఈ అంశాలు సినిమాలో కొంచెం నిరాశ కలిగిస్తాయి. ఈ చిత్రంలో నిర్మాణ విలువలు ఓకే కానీ వి ఎఫ్ ఎక్స్ వర్క్ మాత్రం బాగోలేదు. షాహిద్ పై ఎంట్రీ సీన్ లోనే పేలవమైన గ్రాఫిక్స్ కనిపిస్తాయి. కానీ మిగతా సినిమా అంతా ప్రొడక్షన్ వాల్యూస్ బాగున్నాయి. ఇక మెయిన్ గా సాంకేతిక వర్గం మ్యూజిక్ వర్క్ మాత్రం అదిరింది అని చెప్పవచ్చు. పాటలు కంటే జేక్స్ బిజోయ్ (సరిపోదా శనివారం ఫేమ్) బ్యాక్గ్రౌండ్ స్కోర్ చాలా సీన్స్ ని బాగా ఎలివేట్ అయ్యేలా చేసింది. మంచి స్టైలిష్ బీట్స్ తో మ్యూజిక్ ని ఎంజాయ్ చేస్తూ చూసే ఆడియెన్స్ కి మంచి ట్రీట్ ఇందులో ఉంది. సినిమాటోగ్రఫీ బాగుంది. ఎడిటింగ్ ఇంకొంచెం ఫాస్ట్ గా చేయాల్సింది. ఇక దర్శకుడు రోషన్ ఆండ్రూస్ విషయానికి వస్తే.. తాను మళయాళ సినిమా ముంబై పోలీస్ రీమేక్ ని బాగా హ్యాండిల్ చేసారని చెప్పవచ్చు. తన స్క్రీన్ ప్లే టీం కథనం కొంచెం స్లోగా నడిపించారు కానీ షాహిద్ ఫ్యాన్స్ కి కావాల్సిన మాస్ మూమెంట్స్ మంచి థ్రిల్ మూమెంట్స్ ని డిజైన్ చేసి మంచి ట్రీట్ నే అందించారు. కాకపోతే సెకండాఫ్ ని ఇంకొంచెం బెటర్ గా డిజైన్ చేసి ఉంటే ఇంపాక్ట్ బాగుండేది. ఇక మొత్తంగా చూసినట్టు అయితే ఈ 'దేవా' మంచి మాస్ పోలీస్ యాక్షన్ సినిమాలు అలాగే ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్స్ ని కూడా ఇష్టపడేవారు చూడదగిన సినిమాగా నిలుస్తుంది. కథనం కొంచెం స్లోగా ఉంది కానీ సెకండాఫ్ ని కూడా ఇంకొంచెం క్లారిటీగా మైంటైన్ చేసి ఉంటే ఇంకా బెటర్ ఫీల్ ని కలిగించి ఉండేది. వీటితో అయితే ఓటిటిలో ఈ చిత్రాన్ని ఒకసారికి ట్రై చేయవచ్చు.





## అర్జున్ సర్కార్ కోసం సర్దార్..?

న్యాచురల్ స్టార్ నాని నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'హిట్ 3'పై ఎలాంటి అంచనాలు క్రియేట్ అయ్యాయో అందరికీ తెలిసిందే. దర్శకుడు శైలేష్ కొలను తెరకెక్కిస్తున్న ఈ చిత్రం 'హిట్' ఫ్రాంచైజీ చిత్రాల్లో మూడో భాగంగా రానుంది. ఇక ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన పోస్టర్స్, టీజర్ ఈ సినిమాలో అర్జున్ సర్కార్ అనే పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నాని ఎలాంటి రక్తపాతం చేయబోతున్నాడా అనేది రివీల్ చేశారు. ఇక ఈ సినిమాలో అర్జున్ సర్కార్ పాత్ర ఎలాంటి జాలి, దయ లేని ఓ పోలీస్ ఆఫీసర్‌గా మనకు చూపెట్టబోతున్నారు. అయితే, ఈ సినిమాలో ఓ స్టార్ హీరో కేమియో ఉండబోతుందని.. ఆ పాత్ర 'హిట్ 4' మూవీ కొనసాగింపుకి లీడ్‌గా ఉండబోతుందని నాని ఇప్పటికే తెలిపాడు. అయితే, తాజాగా ఈ పాత్రలో తమిళ హీరో కార్తి నటించబోతున్నట్లు వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. ప్రస్తుతం 'సర్దార్ 2' మూవీలో బిజీగా ఉన్న కార్తి, తెలుగు ప్రేక్షకులకు కూడా చాలా దగ్గరయ్యాడు. దీంతో అతడు అయితే ఈ పాత్రకు పర్ఫెక్ట్‌గా సూట్ అవుతాడని చిత్ర యూనిట్ భావిస్తోందట. మరి నిజంగానే అర్జున్ సర్కార్ కోసం సర్దార్ నిజంగానే వస్తాడా లేదా అనేది వేచి చూడాలి.


### 'మ్యాడ్' స్టార్‌తో
## మెగా డాటర్ మూవీ

మ్యాడ్ చిత్రానికి టాలీవుడ్ బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సెన్సేషన్ రెస్పాన్స్ దక్కిందో అందరికీ తెలిసిందే. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'మ్యాడ్ స్క్వేర్' రాగా, ఇది బాక్సాఫీస్ దగ్గర సాలిడ్ వసూళ్లతో దూసుకెళ్తోంది. ఈ సినిమాను దర్శకుడు కల్యాణ్ డైరెక్ట్ చేశారు. కాగా, ఇందులోని కామెడీ ఎలిమెంట్స్, ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తున్నాయి. ఈ సినిమాలో హీరోలుగా నటించిన రామ్ నితిన్, నార్నె నితిన్, సంగీత్ శోభన్ తమ కామెడీ టైమింగ్‌తో ప్రేక్షకుల్లో మంచి గుర్తింపును తెచ్చుకున్నారు. ఇక ఈ సినిమాలో నటించిన సంగీత్ శోభన్ ప్రస్తుతం ఓ కొత్త సినిమాను స్టార్ట్ చేశారు. మెగా డాటర్ నిహారిక ప్రొడక్షన్ కంపెనీ ది పింక్ ఎలిఫెంట్స్ బ్యానర్‌లో సంగీత్ శోభన్ తన నెక్స్ట్ మూవీని స్టార్ట్ చేశారు. నిహారిక సరసన సంగీత్ శోభన్ నటిస్తుండటంతో ఈ కాంబినేషన్ ఎంతమేర అలరిస్తుందో చూడాలి. ఇక ఈ సినిమాను మానసా శర్మ డైరెక్ట్ చేయనున్నారు. మరి ఈ సినిమాలో నిహారిక, సంగీత్ శోభన్ కెమిస్ట్రీ ఎలా ఉండబోతుందో చూడాలి. ఈ చిత్ర షూటింగ్ త్వరలో షూటింగ్ ప్రారంభించేందుకు చిత్ర యూనిట్ సిద్ధమవుతోంది.




### మీ కథ ఒరిజినల్ కాదా?.. 'లాపతా లేడీస్' సినిమాపై
## నెటిజన్లు విమర్శలు

చిన్న సినిమాగా విడుదలై బాలీవుడ్‌లో బ్లాక్ బస్టర్ అందుకున్న చిత్రం 'లాపతా లేడీస్'. బాలీవుడ్ మిస్టర్ ఫర్‌ఫెక్షనిస్ట్ అమీర్ ఖాన్ ప్రొడక్షన్‌లో వచ్చిన ఈ సినిమాకు అమీర్ ఖాన్ మాజీ భార్య కిరణ్ రావ్ దర్శకత్వం వహించింది. శ్రీవాస్తవ్ ఈ మూవీలో హీరోగా నటించగా నితాన్షి గోయల్, ప్రతిభ రంట హీరోయిన్‌లుగా నటించారు. భోజ్‌పురి నటుడు రవి కిషన్ కీలక పాత్రలో మెరిశాడు. గతేడాది మార్చిలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం సూపర్ హిట్ అందుకోవడమే కాకుండా ఆస్కార్ ఎంట్రీ కూడా ఇచ్చింది. అయితే ఈ సినిమా ఒరిజినల్ కాదని తాజాగా విమర్శలు వస్తున్నాయి. అరబిక్ సినిమాను కాపీ కొట్టి ఈ సినిమాను తీశారంటూ నెటిజన్లు కిరణ్ రావుని ట్రోల్ చేస్తున్నారు.2019లో అరబిక్ భాషలో విడుదలైన చిత్రం 'బుర్ఖా సిటీ'. ఈ సినిమాను ఫాబ్రిస్ బ్రాక్ అనే దర్శకుడు తెరకెక్కించాడు. ఇందులో హీరోకి కొత్తగా పెళ్లి అవ్వగా.. బుర్ఖా ధరించడం వల్ల అతడి భార్య అనుకోని వేరే అమ్మాయిని భార్యగా తన ఇంటికి తీసుకుపోతాడు. ఇంటికి వచ్చాక బుర్ఖా తీసిన అనంతరం అసలు నిజం తెలుస్తుంది. దీంతో తన భార్య మిస్ అయ్యిందని పోలీసులకు కంప్లయింట్ ఇస్తాడు. అయితే తన భార్యను చివరికి ఎలా కనుగొన్నాడు అనేది ఈ సినిమా స్టోరీ. అయితే లాపతా లేడిస్ కథ కూడా అచ్చం ఇలాగే ఉండడంతో




నెటిజన్లు ఈ సినిమాను కాపీ కొట్టారా అంటూ ప్రశ్నిస్తున్నారు. కాగా ఈ విషయంపై చిత్రబృందం స్పందించాల్సి ఉంది.లాపతా లేడీస్ సినిమా విషయానికి వస్తే.. 2001లో గ్రామీణ ప్రాంతానికి చెందిన ఇద్దరు యువ వధువులు రైలు ప్రయాణంలో తప్పిపోయిన సంఘటన ఆధారంగా ఈ సినిమా రాగా దాదాపు పన్నెండేళ్ల విరామం తర్వాత కిరణ్ రావ్ మెగాఫోన్ పట్టింది. ఆమె చివరగా 2010లో దోబీ ఘాట్ అనే చిత్రానికి దర్శకత్వం వహించింది.






## తమన్నా హాట్ లుక్స్

మిల్కీ బ్యూటీ తమన్నాకి అసలు ఇప్పుడు ఏం కావాలి? అనే చర్చ షురూ అయింది ఆన్‌లైన్లో. ఇంత సడన్‌గా అంత భారీ డిస్కషన్ ఎందుకనుకుంటున్నారా? జస్ట్ ఇప్పటికిప్పుడు ఫ్రెష్‌గా స్టార్ట్ అయిందయితే కాదు... విజయ్ వర్మతో విడిపోయారనే వార్తలు మొదలైనప్పటి నుంచి మెల్లిమెల్లిగా మొదలైన చర్చే.. కాకపోతే ఇప్పుడు జోరు ఇంకాస్త పెరిగింది.ఒకప్పుడు సౌత్‌లో ఏ స్టార్ హీరో సినిమా అనౌన్స్ అయినా, హీరోయిన్‌గా తమన్నా పేరు వినిపించేది. కాకపోతే ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. తమన్నా ఇండస్ట్రీలో లేరా.. అంటే లేకపోలేదు. అలాగని టాప్‌లో ఉన్నారా? అని అడిగితే 'బిగ్ నో' అనే ఆన్సర్ వినిపిస్తుంది. ఈ ఆన్సర్‌ని వీలైనంత త్వరగా చెరిపేయాలనే ప్రయత్నంలో ఉన్నారు తమన్నా. సినిమాల్లో నాయికగానే కాదు, ఓటీటీల్లో అద్భుతమైన పాత్రలు చేస్తూ అడపాదడపా డిజిటల్ ఆడియన్స్ కి కూడా చేరువవుతున్నారు తమన్నా. అంతే కాదు, స్పెషల్ సాంగులు చేస్తూ, వారెవా అనిపించుకుంటున్నారు. కెరీర్ పీక్స్‌లో ఉన్నప్పటి నుంచే స్పెషల్ సాంగులు చేస్తున్నప్పటికీ, ఈ మధ్య తమన్నా చేస్తున్న ఐటమ్ సాంగ్స్ గురించి మాత్రం స్పెషల్‌గా మాట్లాడుకుంటున్నారు జనాలు.జైలర్ సినిమాకు భారీ ఓపెనింగ్స్ తెచ్చిన వాటిలో తమన్నా వా కావాలయ్యా సాంగ్ కూడా ఒకటి. అలాగే స్త్రీ2 సక్సెస్‌ని తమన్నా స్పెషల్ సాంగ్‌కి కూడా షేర్ చేశారు మేకర్స్. అంత క్రేజ్ ఉంది కాబట్టే ఇప్పుడు అజయ్ దేవ్‌గణ్ మూవీలోనూ తమన్నాతో స్పెషల్ సాంగ్ చేయిస్తున్నారు.




### సంజూకు
## లైన్‌క్లియర్

ఐపీఎల్ 18లో తొలి మూడు మ్యాచ్‌లకు స్పెషలిస్ట్ బ్యాటర్‌గానే కొనసాగిన సంజూ శాంసన్.. తిరిగి రాజస్థాన్ రాయల్స్‌కు సారథిగా వ్యవహరించనున్నాడు. కుడిచేతి చూపుడు వేలికి గాయం కారణంగా రెండు వారాల పాటు వికెట్ కీపింగ్ చేయొద్దని బీసీసీఐ అతడికి సూచించిన నేపథ్యంలో గత మూడు మ్యాచ్‌లలో సంజూ కీపర్‌గానే గాక సారథ్య బాధ్యతలకూ దూరంగా ఉన్నాడు. దీంతో రియాన్ పరాగ్ రాజస్థాన్‌ను నడిపించాడు. తాజాగా సంజూకు నేషనల్ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) నుంచి క్లియరెన్స్ లభించడంతో అతడు ఈనెల 5న పంజాబ్‌తో జరిగే మ్యాచ్‌తో కెప్టెన్సీ పగ్గాలు చేపట్టనున్నాడు.

# బెంగళూరుకు తొలి ఓటమి
### 8 వికెట్ల తేడాతో ఆర్‌సీబీని చిత్తుచేసిన గుజరాత్

ఐపీఎల్‌లో రెండు వరుస విజయాలతో జోరుమీదున్న రాయస్థాన్ రాయల్స్‌కు గుజరాత్ టైటాన్స్ బ్రేకులు వేసింది. బెంగళూరు వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఆతిథ్య జట్టు ఆర్‌సీబీని గుజరాత్ ఎనిమిది వికెట్ల తేడాతో చిత్తు చేసింది. ఆర్‌సీబీ విధించిన 170 పరుగుల లక్ష్యాన్ని జీటీ 17.5 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది. అటు బౌలింగ్, ఇటు బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించిన శుభ్‌మన్ గిల్ సేన ఐపీఎల్‌లో రెండో విజయాన్ని నమోదు చేసింది. బ్యాటింగ్‌లో సాయి సుదర్శన్, జోస్ బట్లర్, రూథర్‌ఫోర్డ్ రాణించడంతో గుజరాత్ రెండు వికెట్లు నష్టపోయి విజయాన్ని అందుకున్నది. బెంగళూరు చిన్నస్వామి స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచిన జీటీ కెప్టెన్ గిల్ బౌలింగ్ ఎంచుకున్నాడు. తొలుత బ్యాటింగ్ చేసిన రజత్ పాటిదార్ నేతృత్వంలోని జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి కేవలం 169 పరుగులు మాత్రమే చేయగలిగింది. గుజరాత్ బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో పరుగులు చేయడం కష్టంగా మారింది. హైదరాబాదీ బౌలర్ మహ్మద్ సిరాజ్, సాయి కిశోర్, అర్షద్ ఖాన్, ప్రసిద్ధ్ కృష్ణ అద్భుతంగా బౌలింగ్ చేయడంతో ఆర్‌సీబీ బ్యాటర్లు పెవిలియన్‌కు క్యూ కట్టారు.

ఒక దశలో 42 పరుగులకే నాలుగు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో కూరుకుపోగా.. ఆర్‌సీబీని లివింగ్‌స్టోన్ (54), జితేశ్ శర్మ (33) ఆదుకున్నారు. చివరలో టిమ్ డేవిడ్ సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడడంతో బెంగళూరు ఆమాత్రం స్కోర్ చేయగలిగింది. ఫిల్ సాల్ట్ (14), విరాట్ కోహ్లీ (7), దేవ్‌దత్ పడిక్కల్ (4), రజత్ పాటిదార్ (12), కృణాల్ పాండ్యా (5) పరుగులు మాత్రమే చేయగలిగారు. మహ్మద్ సిరాజ్‌కు మూడు వికెట్లు పడగొట్టగా.. సాయిసుదర్శన్‌కు రెండు, అర్షద్ ఖాన్, ప్రసిద్ధ్ కృష్ణ, ఇషాంత్ శర్మకు తలో వికెట్ దక్కింది.




బెంగళూరు నిర్దేశించి 170 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన గుజరాత్‌కు ఓపెనర్లు శుభ్‌మన్ గిల్, సాయిసుదర్శన్ శుభారంభం అందించారు. ఇద్దరు తొలి వికెట్‌కు 33 పరుగుల భాగస్వామ్యాన్ని అందించారు. 14 బంతుల్లో ఒక ఫోర్, సిక్సర్‌తో 14 పరుగులు చేసిన శుభ్‌మన్ గిల్ భువనేశ్వర్ కుమార్ బౌలింగ్‌లో లివింగ్‌స్టోన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత సాయిసుదర్శన్, జోస్ బట్లర్ కలిసి గుజరాత్‌ను విజయం నడిపించారు. ఇద్దరు కలిసి రెండో వికెట్‌కు హాఫ్ సెంచరీ భాగస్వామ్యాన్ని నమోదు చేశారు. ఆ తర్వాత 36 బంతుల్లో ఏడు ఫోర్లు, సిక్సర్ సహాయంతో 49 పరుగులు చేసి అవుట్ అయ్యాడు. దాంతో తృటిలో హాఫ్ సెంచరీ మిస్ చేసుకున్నాడు.ఆ తర్వాత జోస్ బట్లర్ రూథర్‌ఫోర్డ్‌తో కలిసి గుజరాత్‌కు విజయాన్ని అందించాడు. 39 బంతుల్లో (ఆరు సిక్సర్లు, ఐదు ఫోర్ల)తో అజేయంగా 73 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. రూథర్‌ఫోర్డ్ 18 బంతుల్లో మూడు సిక్సర్లు, ఫోర్ సహాయంతో 30 పరుగులు చేశాడు. బెంగళూరు బౌలర్లలో భువనేశ్వర్ కుమార్‌కు ఒకటి, జోష్ హాజిల్‌వుడ్ ఒక వికెట్ దక్కింది. ఇక ఈ విజయంతో ఐపీఎల్ పాయింట్ల పట్టికలో గుజరాత్ టైటాన్స్ నాలుగో స్థానానికి చేరింది. ఆర్‌సీబీ మూడోస్థానానికి పడిపోగా.. పంజాబ్ కింగ్స్ అగ్రస్థానంలో ఉన్నది. రెండు విజయాలతో పంజాబ్, ఢిల్లీ క్యాపిటల్స్ జట్ల ఖాతాలో నాలుగేసి పాయింట్లు ఉండగా.. రన్‌రేట్ పరంగా మెరుగ్గా ఉండడంతో పంజాబ్ అగ్రస్థానంలో ఉన్నది. ఇక ఐపీఎల్‌లో భాగంగా గురువారం కోల్‌కతా నైట్‌రైడర్స్ - సన్ రైజర్స్ హైదరాబాద్ మధ్య కోల్‌కతా వేదికగా మ్యాచ్ జరుగనున్నది.

### ముంబైని వదిలేసిన
## యశస్వి జైస్వాల్

దేశవాళీ క్రికెట్‌లో కొత్త జట్టుతో యశస్వి జైస్వాల్ ఆడనున్నాడు. 20242025 సీజన్‌లో ముంబై జట్టు తరపున జైస్వాల్ ఆడిన విషయం తెలిసిందే. ఇటీవల ముగిసిన రంజీ ట్రోఫీ టోర్నీలో ముంబై తరపున జైస్వాల్ ప్రాతినిధ్యం వహించాడు. అయితే తన కెరీర్‌లో భారీ మార్పు చేసుకున్నాడతను. అండర్ 19 క్రికెట్ ఆడుతున్న నాటి నుంచి ముంబై తరపున ఆడిన ఆ టీమిండియా ఓపెనర్ ఇప్పుడు దేశవాళీ క్రికెట్‌లో గోవా తరపున ఆడేందుకు డిసైడ్ అయ్యాడు. వచ్చే సీజన్ నుంచి అతను గోవా తరపున ఆడనున్నాడు. దీని కోసం అతను ముంబై క్రికెట్ అసోసియేషన్ నుంచి నో ఆబ్జెక్షన్ సర్టిఫికేట్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. స్టేట్ క్రికెట్‌ను మార్చుకోనున్నట్లు అతను తెలిపాడు. ఇటీవల ముంబై ప్లేయర్లు అర్జున్ టెండూల్కర్, సిద్దేశ్ లాడ్‌లు.. స్వరాష్ట్రాన్ని వీడి గోవా తరపున రంజీలో ఆడిన విషయం తెలిసిందే.




Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana 500074 and Published at H.No. 101101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana 500035. EDITOR: GATTIMI SATISH KUMAR, RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465